నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 22-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి:32 సంచిక:223 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం-నేటికి అందం

జటిల సమస్యలు దీర్చెడి
పటుతర సహకార మిడెడి వాగ్ధారలతో
స్ఫుటముగ గెలిచె నరేంద్రుం
డిటలీయుల మానసముల నీప్సిత మొప్పన్ !!

(జటిలమైన వివిధ రంగాలలో సహకరించడానికి ఇటలీలో భారత ప్రధాన మంత్రి మోడీ వాగ్దానం చేసి ఇటలీ దేశీయుల అభిమానాన్ని చూరగొని వివిధ రంగాలలో వాణిజ్యాభివృద్ధికి దోహదం చేశారు)

-రాధశ్రీ
సెల్:9494481210

చురక

ప్రభుత్వం ఎట్లున్నా
ప్రతిపక్షం పగపట్టు
రైతులను రెచ్చగొట్టి
రాజకీయ సెగపెట్టు
కల్లాల్లో ధాన్యాన్ని
కొనడంలో తాత్సారం
అదేకదా ఎవరికైనా
అసంతృప్తి కాసారం

-వేల్పుల నారాయణ
9440433475

తెలంగాణలో కార్మికులకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం రేవంత్..

హైదరాబాద్, మే 21: కార్మికులకు తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమి స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం.

జోన్-1లో మున్సి పల్ కార్పొరేషన్స్, జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీస వేతనం నిర్ణయించాం. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు వేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుంది.

ఐటీ, అమెరికా ఆలోచనలు వద్దు..

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి.. కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలి.

ధరలు రోజూ పెంచుతారా..

ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలి.

బండి సంజయ్ అప్పగించలేదు..

పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు. కేటీఆర్ భావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట్ల రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారు.

కేసీఆర్ బయటకు రారా

కేసీఆర్ దిగిపోయి చాలా రోజులు అయ్యింది. పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్.. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదు?. కులగణన విషయంలో సుప్రీం కోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. తెలంగాణ నిర్ణయాన్ని ఉన్నత న్యాయస్థానం సమర్థించడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. తెలంగాణలో జనగణనతో పాటు కులగణన చేసి అన్ని వివరాలు ప్రజల ముందుంచాం. 'జనగణనలో కులగణన' విషయంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచింది. మోదీ ప్రభుత్వం తక్షణమే జనగణనలో కులగణన చేర్చి బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలి' అని అన్నారు.

పశ్చిమాసియా సంక్షోభ ప్రభావాలపై కేంద్ర కేబినెట్ కీలక చర్చ

న్యూఢిల్లీ, మే 21:ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈరోజు (గురువారం) సాయంత్రం 5 గంటలకు కేంద్ర మంత్రిమండలి సమావేశం ప్రారంభమైంది. అయితే, 11 నెలల తర్వాత కేంద్ర కేబినెట్ సమావేశమైంది. జూన్ 9వ తేదీకి మోదీ ప్రభుత్వం రెండేళ్ల పూర్తి చేసుకుంటున్న విషయం తెలిసిందే. కేంద్ర కేబినెట్ సమావేశంలో ప్రధానంగా దేశంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా ప్రజలకు చేరుతున్న సేవలు, వివిధ పథకాల అమలు స్థితి, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల ప్రభావంపై మంత్రులతో ప్రధాని మోదీ మాట్లాడుతున్నారు. అలాగే దేశవ్యాప్తంగా కొనసాగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై కూడా సమీక్షించనున్నారు.

రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు వంటి కీలక ప్రాజెక్టుల అమలు వేగం, పెట్టుబడుల పరిస్థితి, భవిష్యత్తు కార్యాచరణపై మంత్రివర్గంతో ప్రధాని చర్చించనున్నారు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలకు దారితీస్తున్న పశ్చిమాసియా సంక్షోభంపై కూడా ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలోని పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావం, చమురు ధరల మార్పులు, వాణిజ్యంపై పడే ప్రభావం వంటి అంశాలను ప్రధాని మోదీ సమీక్షి స్తున్నారు. వివిధ మంత్రిత్వ శాఖల పనితీరు, తీసుకున్న నిర్ణయాలు, రాబోయే రోజుల కార్యాచరణపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రులు తమ శాఖలకు సంబంధించిన పురోగతి నివేదికలను ప్రధాని ముందు ఉంచినట్లు సమాచారం. ఈ సమావేశంలో భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలు, పెట్టుబడుల ప్రోత్సాహం, ఆర్థిక వృద్ధి, సంక్షేమ కార్యక్రమాల మరింత సమర్థవంతమైన అమలుపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ.. తెలంగాణ రైల్వే ప్రాజెక్టులపై చర్చ

న్యూ ఢిల్లీ, మే 21: కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈరోజు (గురువారం) ఢిల్లీలో కలిశారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. తెలంగాణలో రైల్వేప్రాజెక్టుల పురోగతి, కొత్త ప్రాజెక్టులు, ఎలక్ట్రిఫికేషన్ తదితర ప్రాజెక్టులపై మాట్లాడారు. ఈ సమావేశంలో తెలంగాణలోని 42 ప్రధాన రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులకు సంబంధించి వివరంగా చర్చించారు. హైదరాబాద్ నగరంతో పాటుగా, చుట్టుపక్కల ప్రాంతాల ప్రయాణికులకు కీలకమైన రవాణా సౌకర్యంగా ఉన్న ఓఆర్ఆర్ విషయంపై మాట్లాడారు. టైమింగ్స్ రెగ్యులరైజేషన్, సౌకర్యాలను మరింత మెరుగుపరిచేలా చొరవ తీసుకోవాలని తాను కోరానని.. దీనికి కేంద్ర రైల్వేమంత్రి సానుకూలంగా స్పందించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తదనుగుణంగా ఓఆర్ఆర్ మెరుగుపరచడం కోసం చర్యలు తీసుకుంటామని కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కొత్త రైల్వేలైన్లు, హైస్పీడ్ రైల్ కారిడార్ పనుల పురోగతి తదితర అంశాలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో తెలంగాణలో రైల్వేల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి అంకితభావంతో పనిచేస్తోందని వెల్లడించారు. రానున్న రోజుల్లోనూ రైల్వేనెట్‌వర్క్ పెంచడం, ప్రజలకు సౌకర్యాల అభివృద్ధిలో పూర్తి సహకారం ఉంటుందని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

మహానాడులో 20 తీర్మానాలు.. రాజకీయ అంశాలపై విస్తృత చర్చ

అమరావతి, మే 21:తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సమావేశం ఈరోజు (గురువారం) మంగళగిరిలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. నూతన కార్యవర్గం, పొలిట్‌బ్యూరో నియామకం తర్వాత తొలిసారి ఈ భేటీ జరిగింది. ఈ సమావేశానికి వర్చువల్‌గా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ భేటీలో మహానాడు నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మహానాడు వేదికగా చేపట్టాల్సిన తీర్మానాలు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారంపై విస్తృతంగా చర్చించారు. ఈసారి మహానాడులో మొత్తం 20 కీలక తీర్మానాలను ప్రవేశపెట్టాలని పొలిట్‌బ్యూరో నిర్ణయించింది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన 10 తీర్మానాలు, తెలంగాణకు సంబంధించిన 4 తీర్మానాలు, అండమాన్‌కు సంబంధించిన ఒక తీర్మానం, ఉమ్మడి అంశాలపై 4 తీర్మానాలు, రాజకీయ తీర్మానాలు ఉండనున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పెట్టుబడులు, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.

మహిళా సంక్షేమంపై ఫోకస్..

2026 మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని పొలిట్‌బ్యూరో నిర్ణయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు మహిళా సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు, మహిళల భాగస్వామ్యంతో అమలు చేసిన కార్యక్రమాలను మహానాడు వేదికగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మహిళల భాగస్వామ్యంతోనే ప్రతి సంక్షేమ పథకాన్ని రూపొందించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, యువతకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలపై మహానాడులో సమగ్ర చర్చ జరగాలని దిశానిర్దేశం చేశారు.

పండుగ వాతావరణంలో మహానాడు: సీఎం చంద్రబాబు

ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లేలా మహానాడును నిర్వహించాలని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహానాడును పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమానికి రెండు రోజుల ముందే ప్రతి ఇంటిపై టీడీపీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ అగ్రనాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు అందరినీ మహానాడులో భాగస్వాములను చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మహానాడు ప్రారంభానికి ముందు రాష్ట్రంలోని అన్ని క్లస్టర్లలో దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు విగ్రహాలకు నివాళులు అర్పించి కార్యక్రమాలను ప్రారంభించాలని నిర్ణయించారు. అలాగే ఎన్టీఆర్ సిద్ధాంతాలు, తెలుగుదేశం పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేసేలా ప్రత్యేక ప్రజెంటేషన్లు నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ ఆవిర్భావం నుంచి జరిగిన రాజకీయ, సామాజిక మార్పులను మహానాడు వేదికగా ప్రదర్శించాలని సీఎం మార్గనిర్దేశం చేశారు.

గొడ్డలి పార్టీ కుట్రలపై చర్చించాలి..

పొలిట్ బ్యూరో సమావేశంలో వైసీపీపై కూడా తీవ్ర విమర్శలు చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టిస్తున్న 'గొడ్డలి పార్టీ కుట్రలను' మహానాడు వేదికగా ప్రజల ముందుంచాలని నిర్ణయించారు. అలాగే 'నా దేశం-నా బాధ్యత' పేరుతో పొదుపు చర్యలు, సామాజిక బాధ్యతలపై ప్రత్యేక చర్చలు నిర్వహించనున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

ఆదిలాబాద్, మే 21: ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ కోరారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం సర్సాపూర్ కమ్యూనిటీ హాల్లో గురువారం ప్రధాన్ మంత్రి జన్మన్ ఆదివాసి న్యాయ మహా అభియాన్ మెడికల్ క్యాంపును నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య పరీక్షల వల్ల శరీరంలో అనారోగ్య సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఏనుగు ఝాన్సీరాణి, డాక్టర్ ఆదిత్య సర్పంచ్ ప్రభావు , ఉప సర్పంచ్ పర్భత్ రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పుట్ట సత్తయ్య, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ పంచాయతీ సెక్రటరి జగదీశ్, అంగన్‌వాడీ టీచర్ జమున, సీతభాయి పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం.. ఎనిమిది కార్లు దగ్ధం

మెదక్, మే 21: మెదక్ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. తూప్రాన్ సమీపంలో జాతీయ రహదారి 161-44పై ప్రయాణిస్తున్న కంటైనర్ లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మహా రాష్ట్ర వైపు నుంచి హైదరాబాద్‌కు వస్తున్న కంటైనర్ లారీ అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎనిమిది కార్లు దగ్ధం..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లారీలో కొత్తగా తరలిస్తున్న ఎనిమిది మారుతీ కార్లు ఉన్నాయి. మంటలు ఒక్కసారిగా వ్యాపించి కంటైనర్‌తో పాటు అన్ని కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు ఎగిసిపడటంతో జాతీయ రహదారిపై భయాందోళన వాతావరణం నెలకొంది. స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదం కారణంగా ఎన్.హెచ్-44పై కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భద్రతా చర్యల్లో భాగంగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే విషయం. అయితే కోట్ల రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ లేదా సాంకేతిక లోపం వల్లే ఈ మంటలు చెలరేగి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

తెలంగాణలో గోవధపై మండిపడిన బీజేపీ చీఫ్ రాంచందర్ రావు..

హైదరాబాద్, మే 21: తెలంగాణలో గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్‌లో గోవుల అక్రమ రవాణా, వధ జరుగుతోందని అన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ కొందరు కావాలనే వాటిని ఉల్లంఘిస్తున్నారని ఆయన మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ జరుగుతోందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గోమాత రక్షణ కోసం శాంతియుతంగా పనిచేస్తున్న గోరక్షకులు, బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. గోరక్షకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ కార్యకర్తలపై విధించిన బైండోవర్ చర్యలను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రాంచందర్ రావు సూచించారు. గోవధకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసులు పక్షపాత ధోరణిని విడిచిపెట్టి చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు. గోమాత హిందువుల జీవన విధానంలో పవిత్రమైన భాగమని, వండుగల పేరుతో గోవధ చేస్తే సహించబోమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే శక్తులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో గోవధ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన తమ కార్యకర్తలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

స్థానిక చర్యలతో ప్రపంచ స్థాయి సానుకూల ప్రభావం

(22 మే "అంతర్జాతీయ జీవ వైవిధ్య దినం" సందర్భంగా)

పరిశోధకుల అంచనా ప్రకారం దాదాపు 87 లక్షల భాచర జీవజాతులు, 22 లక్షల జలచర జీవజాతులు ఉన్నాయి. జీవ వైవిధ్యం అనగా భూమిపై కనిపించే వృక్ష జాతులు, జంతు జాతులు, సుక్ష్మ జీవులు, అడవులు, ఎడారులు, వ్యవసాయ క్షేత్రాలు జల వనరుల జనాభా, వాటి మధ్య వైవిధ్యాలు, వాటి సంఖ్యలో సమతుల్యత మాత్రమే కాకుండా జన్యు పరమైన అంశాలు అని కూడా అర్థం చేసుకోవాలి. జీవ వైవిధ్యం లోపిస్తే మానవాళితో పాటు సకల జీవుల మనుగడ ప్రశ్నార్థకం అవుతూ, కరోనా లాంటి విపత్తులు లోకాన్ని కమ్ముతాయి. ప్రపంచంలోనే 3 బిలియన్ల ప్రజలకు జంతు ప్రొటీన్లను అందించే చేపల నుంచి 80 శాతం ప్రజలు ఆహారం కోసం వృక్ష జాతుల మీదనే ఆధారపడి ఉన్నారు. దాదాపు 80 శాతం గ్రామీణ ప్రజలు సాంప్రదాయ ఔషధాల కోసం వృక్షాల మీదనే ఆధారపడి ఉన్నారు.

అంతర్జాతీయ జీవ వైవిధ్య దినం:

జీవ వైవిధ్యం దెబ్బతిన్నపుడు జీవజాతుల సాధారణ ఆరోగ్యం ప్రభావితం అవుతుంది. జీవ వైవిధ్యానికి విఘాతం ఏర్పడింది కాబట్టే కరోనా వైరస్ విజృంభించా ప్రపంచ మానవాళి ఆరోగ్యాలను హరించడం, ప్రాణాలు తీయడం నిస్సహాయంగా చూసాం. జీవ వైవిధ్యం విచ్ఛిన్నం అయినపుడు జంతువుల నుంచి మానవాళికి సంక్రమించే వ్యాధులు పెరుగుతాయి. నేడు ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి పేరుతో మానవుడు చేస్తున్న పర్యావరణ విధ్వంసం నేరుగా జీవ వైవిధ్యంపై ప్రతికూల ప్రభావాలను చూపుతున్నది. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ఎదడాన్ని సుస్థిరాభివృద్ధి అంటూ పిలుస్తున్నాం. మానవ శరీరంలో కూడా ఏదైనా అవయవంలో అపరిమితంగా కణజాలం పెరిగితే క్యాన్సర్ అంటూ ఏజుస్తున్నాం. అలాగే భూతలం లేదా జల వనరుల్లో జీవ జాతుల సంఖ్య సమతుల్యతను అధిగమించి అపరిమితంగా పెరిగినా లేదా తగ్గినా అది ప్రమాదకరంగా మారుతూ జీవవైవిధ్య వినాశనంగా పేర్కొంటున్నాం. నేటి ఆధునిక యుగంలో జీవ వైవిధ్య పరిరక్షణ ప్రాధాన్యాన్ని ప్రజలకు అవగాహన పరచడానికి, జీవ వైవిధ్య విఘాతాలను కట్టడి చేయడానికి ప్రతి ఏట 22 మే రోజున "అంతర్జాతీయ జీవ వైవిధ్య దినం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ బయోడైవర్సిటీ"ని పాటించడం 1992 నుంచి ప్రారంభమైంది.

2026 అంతర్జాతీయ జీవైవిధ్య దినం ఇతివృత్తం:

అంతర్జాత జీవ వైవిధ్య దినం-2026 ఇతివృత్తంగా "ప్రపంచ సానుకూల ప్రభావం కోసం స్థానికంగా వ్యవహరించడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. అడవులను నరికిన కారణంగా అటవీ జంతువులైన కోతులు, పులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు లాంటివని జనావాసాల్లోకి చేరి ప్రాణాలు తీయడం లేదా పౌర సమాజ సాధారణ జీవనానికి విఘాతం కలిగించడం చూస్తున్నాం. అడవులను నరికి పోడు భూములుగా సాగుబడి కొనసాగిస్తున్నాం. వన్య ప్రాణులను చంపి అక్రమ వ్యాపారం చేస్తున్నాం. కొన్ని జీవులు అంతరించే అంచుకు చేరడం రానున్న ప్రమాద సూచిక అని మరిచి పోతున్నాం. జీవవైవిధ్య పరిరక్షణ లేదా జీవ వైవిధ్య లోటును బరితో చేయడానికి వెంటనే మనం నడుం బిగించాలి. నేటి నిర్లక్ష్యం రేపటి తరం మనుగడకు శాపంగా మారుతుందని మరిచి పోవద్దు.

మనిషి ప్రకృతితో మమేకం అవుతూ, దాని సహజత్వాన్ని కాపాడుతూ జీవనయానం కొనసాగించాలి. ప్రకృతికి విరుద్ధంగా వెళితే మన బొంద మనమే తవ్వుకున్నట్లు లేదా మనం కూర్చున్నా ప్రకృతి అనబడే కొమ్మను మనే నరుక్కున్నట్లు. అతి వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తున్న నరుడు, పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిందే. దురాశ, అజ్ఞాన తెరలు కమ్మినపుడు జీవ వైవిధ్య సమతుల్యత దెబ్బతిని సకల జీవుల సాధారణ జీవనంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలుసుకొని, జీవ వైవిధ్యానికి విఘాతం కలిగించే అభివృద్ధి వద్దంటూ, సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు పడాలి, రేపటి తరం భూతల స్వర్గంలో సుఖ సంతోషాలతో జీవనయానం కొనసాగించాలి.

-మధుపాళీ
9949700037

మూడో ఇండియా-నార్డిక్ సదస్సు నేపథ్యంలో ఫిన్లాండ్ ప్రధానితో భేటీ అయిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మే 21:ఓస్లోలో జరుగుతున్న మూడో ఇండియా-నార్డిక్ సదస్సు నేపథ్యంలో 2026 మే 19న ఫిన్లాండ్ ప్రధాని శ్రీ పెటెరి ఓర్పోతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సమావేశమయ్యారు.

డిజిటలైజేషన్, సుస్థిరతలో ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచిన నేపథ్యంలో పరిశ్రమ, పరిశోధనా సంస్థలు, విద్యా సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని ఇద్దరు నాయకులు స్పష్టం చేశారు. భవిష్యత్తు ఆర్థిక వృద్ధిని, ప్రగతిని నడిపించడంలో సుస్థిరత, డిజిటలైజేషన్ పోషించే కీలకపాత్రను వారు తెలియజేశారు. వ్యాపారం -పెట్టుబడులు, డిజిటలైజేషన్, ఏఐ, 5జీ/6జీ, క్వాంటమ్ టెక్నాలజీలు, అంతరిక్షం, సుస్థిరత, పునరుత్పాదక ఇంధనం, పునర్వినియోగ ఆర్థిక వ్యవస్థ, ఆవిష్కరణ, విద్య, రవాణా, ప్రజల మధ్య సంబంధాల్లో కొనసాగుతున్న సహకారాన్ని సమీక్షించారు.

అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ వస్తు, సేవల ద్వైపాక్షిక వాణిజ్యంలో సాధించిన స్థిరమైన వృద్ధిని ఉభయ పక్షాలు స్వాగతించాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెట్టింపు చేయాలన్న వారి నిబద్ధతను పునరుద్ఘాటించారు. అలాగే విస్తరించిన కార్యకలాపాలు, భాగస్వామ్యాల ద్వారా ఇరు మార్కెట్లలోనూ రెండు దేశాలకు చెందిన అగ్ర టెక్నాలజీ సంస్థల ఉనికి పెరగడాన్ని వారు స్వాగతించారు. ఫిన్లాండ్ టెక్నాలజీ రంగంలో వృద్ధికి, ఆవిష్కరణలకు భారతీయ నిపుణులు అందిస్తున్న గణనీయమైన సహకారాన్ని ఫిన్లాండ్ అభినందించింది. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 2026 సెప్టెంబరులో జరిగే ప్రపంచ పునర్వినియోగ ఆర్థిక వేదికకు భారత్, ఫిన్లాండ్ సంయుక్తంగా నిర్వహించనున్నట్లు నాయకులు ప్రకటించారు.

ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలతో కూడిన ఆత్మీయ, స్నేహపూర్వక, బహుముఖ సంబంధాలు భారత్, ఫిన్లాండ్ మధ్య ఉన్నాయి. యూరోపియన్ యూనియన్, నార్డిక్ ప్రాంతంలో భారత్‌కు అత్యంత విలువైన భాగస్వామిగా ఫిన్లాండ్ ఉంది. భారత్-ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యం సాధించిన పురోగతి పట్ల నాయకులిద్దరూ సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే భారత్-ఈయూ స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం త్వరగా అమల్లోకి తీసుకురావడానికున్న ప్రాధాన్యాన్ని గుర్తించారు. ప్రాంతీయ, ప్రపంచ పరిణామాలపై, అంతర్జాతీయ సంస్థల్లో సహకారాన్ని వృద్ధి చేయడంపై తమ ఆలోచనలను వారు పంచుకున్నారు.

హత్నూరలో ధాన్యం కొనుగోలు నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్

-డి.సి.ఓ, హత్నూర ఎంపీడీవో, ఏపీఎంలకు షోకాజ్ నోటీసులు జారీ

-ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరిక

సంగారెడ్డి, మే 21(నేటి నిజం ప్రతినిధి) హత్నూర మండలంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం, సమన్వయ లోపాలు, పర్యవేక్షణలో వైఫల్యాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, హత్నూర ఎంపీడీవో బి.శంకర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజశేఖర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

హత్నూర మండలంలో ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు సంతృప్తికరంగా నిర్వహించబడటం లేదని గుర్తించామని, కొనుగోలు కేంద్రాల వద్ద పర్యవేక్షణ, మానిటరింగ్, సమన్వయంలో తీవ్ర లోపాలు ఉన్నట్లు వెల్లడైందన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ఫీల్డ్ స్థాయిలో సమర్థవంతమైన పర్యవేక్షణ లేకపోవడం, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యాలు చోటుచేసుకోవడం, సంబంధిత శాఖలు, ఏజెన్సీల మధ్య సమన్వయం లోపించడం వల్ల కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, మూడు రోజుల లోగా తమ వివరణ సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎండ తీవ్రతపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

-వృద్ధులు, దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

-జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశం

ఏలూరువే 21:జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ నుండి ఎండ తీవ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె పలు సూచనలు జారీ చేశారు. రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 26వ తేదీ వరకూ తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ అత్యవసరమైతేనే బయటకు రావాలని, అలా వచ్చే వారు తగినంత తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని సూచించారు. శరీర ఉష్ణోగ్రత పెరగడం, అధిక దాహం, తలనొప్పి, వాంతులు, అలసట వంటి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గర్లో ఉన్న వైద్య కేంద్రాలను సంప్రదించాలన్నారు.

ఎండ తీవ్రతపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఎటువంటి చిన్న పొరపాటు జరిగినా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. వ్యవసాయం, ఉద్యానవన పంటలు, మూగజీవాలను డ్రోన్ల ద్వారా సర్వే చేసి నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులు ఎండలో తిరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా దివ్యాంగుల సహాయ సంచాలకులను ఆదేశించారు. ముఖ్యమైన కూడళ్లలో చలివేంద్రాలు, ప్రయాణికుల కోసం తాత్కాలిక పందిళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఎస్సీ తదితర పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. వేసవిలో కరెంట్ కోతలు, లో-వోల్టేజీ సమస్యలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

చేపలు, రొయ్యల చెరువుల వద్ద ఎండ సమయాల్లో పనులు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ డీడీని, పరిశ్రమల్లో రసాయనిక పదార్థాల వద్ద ప్రమాదాలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లాకు కొత్తగా వచ్చిన వాహనాలను సద్వినియోగం చేసుకుంటూ ఎలాంటి సమాచారం వచ్చినా వెనువెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. పర్యాటక కేంద్రాలు, పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఏలూరు, నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్లు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని, పంట పొలాల్లో వ్యర్థాలను కాల్చకుండా నివారించాలన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా మున్సిపల్, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆరోగ్య శాఖ అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్లను అందుబాటులో ఉంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, బస్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. ఎండ తీవ్రతపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని డీపీఆర్వోను ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లాలోని వివిధ శాఖల అధికారు లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రూ.1,500 కోట్లతో మూడు కీలక ప్రాజెక్టులు

అమరావతి, మే 21: విశాఖపట్నంలో మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కీలక ఆమోదం తెలిపిందని విశాఖ ఎంపీ శ్రీభరత్ వెల్లడించారు. మొత్తం రూ.1,501.03 కోట్ల అంచనా వ్యయంతో మూడు ప్రధాన ప్రాజెక్టులను అమలు చేయనున్నట్లు తెలిపారు.

మధురవాడ జోన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధికి రూ.658.61 కోట్లు కేటాయించినట్లు ఎంపీ తెలిపారు. అలాగే స్మార్ట్ తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు కోసం రూ.725.18 కోట్లు వెచ్చించనున్నట్లు చెప్పారు.

బల్క్ అండ్ సెమీ బల్క్ నీటి సరఫరా వ్యవస్థ ఆధునీ కరణ కోసం మరో రూ.117.24 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులతో విశాఖ నగరంలో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడతాయని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు.

వేప్‌లను స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ

అమరావతి, వే 21:దేశంలో నిషేధిత ఈ-సిగరెట్లు, వేప్‌ల అక్రమ రవాణా చేస్తున్న భారీ స్మగ్లింగ్ ముఠాను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఏకకాలంలో నిర్వహించిన సోదాల్లో భారీ మొత్తంలో నిషేధిత ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు.

డీఆర్ఐ అధికారులు చేపట్టిన దాడుల్లో 3 లక్షలకు పైగా ఈ-సిగరెట్లు, వేప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.120 కోట్ల వరకు ఉంటుందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా బ్లాక్ మార్కెట్లలో ఈ ఉత్పత్తులను సరఫరా చేస్తున్న ముఠాపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు సమాచారం.

ప్రాథమిక విచారణలో అంతర్జాతీయ కస్టమ్స్ వ్యవస్థ కళ్లుగప్పి ఈ అక్రమ దందా కొనసాగుతున్నట్లు తేలిందని అధికారులు తెలిపారు.

విదేశాల నుంచి రహస్య మార్గాల్లో వేప్‌లు, ఈ-సిగరెట్లు దేశంలోకి తీసుకొచ్చి విక్రయిస్తున్న నెట్‌వర్క్‌పై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఆధునిక భారత నిర్మాణ శిల్పి రాజీవ్ గాంధీకి ఘన నివాళులు

-రోగులకు పండ్లు పంపిణీ చేసిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, మే 21 (నేటి నిజం ప్రతినిధి)భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని రాజీవ్ పార్కులో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహానికి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి విశేష కృషి చేసిన దూరదృష్టి గల నాయకుడని కొనియాడారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని, యువతకు విస్తృత అవకాశాలు కల్పించడంతో పాటు సమాచార సాంకేతిక రంగ అభివృద్ధికి బలమైన పునాది వేసిన మహానేతగా నిలిచారని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిని సందర్శించిన నిర్మలా జగ్గారెడ్డి అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, సీడీసీ చైర్మన్ గడిలా రామ్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కూన సంతోష్, ప్రభు గౌడ్, కౌన్సిలర్ తోపాజి వీణ హరీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

3వ ఇండియా-నార్డిక్ సదస్సు సందర్భంగా డెన్మార్క్ తాత్కాలిక ప్రధాన మంత్రితో సమావేశమైన భారత ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, వే 21: ఇండియా-నార్డిక్ మూడో సదస్సు సందర్భంగా ఓస్లోలో ఈ రోజు డెన్మార్క్ తాత్కాలిక ప్రధాన మంత్రి శ్రీమతి మెట్టె ఫెడరిక్సన్‌తో భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సమావేశమయ్యారు.

ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించిన ఉభయ దేశాల నాయకులు, ఉమ్మడి కార్యాచరణలో సాధించిన పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యావరణం, వాతావరణ మార్పుల రంగాల్లో సహకారానికి ప్రాధాన్యతనిస్తూ రెండు దేశాల్లో హరిత పరివర్తనకు తోడ్పడేలా ఉమ్మడి ప్రయత్నాలను ఏకీకృతం చేసే 'భారత్-డెన్మార్క్ హరిత వ్యూహాత్మక భాగస్వామ్యం' సాధించిన పురోగతిని ఇరు నేతలు స్వాగతించారు. 2020లో ఈ హరిత వ్యూహాత్మక భాగస్వా వ్యం ప్రారంభమైనప్పటి నుంచి ఇరు దేశాల మధ్య క్రమం తప్పకుండా జరుగుతున్న ఉన్నత స్థాయి పర్యటనలు, చర్చలను గుర్తుచేసిన ఇరు దేశాల నాయకులు.. సరికొత్త- వర్ధమాన సాంకేతికతలు, కమ్యూనికేషన్స్, అధునాతన పరిశోధనలు, అంకురాలు, విద్యాసంబంధ మార్పిడి రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవా లని నిర్ణయించారు. రక్షణ, కృత్రిమ మేధస్సు రంగాల్లో సహకా రంపై కూడా వారు చర్చించారు. గుజరాత్‌లోని 'గిఫ్ట్ సిటీ'లో తమ కార్యకలాపాలను ప్రారంభించాల్సిందిగా డెన్మార్క్ కంపెనీలను ప్రధాన మంత్రి ఆహ్వానించారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థలో హరిత పరిష్కారాల కోసం డెన్మార్క్ సాంకేతికతలను స్వాగతించడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి మోదీ తెలియజేశారు. నీటి సంరక్షణ రంగానికి సంబంధించి వారణాసిలో 'స్వచ్ఛమైన నదులపై స్మార్ట్ ప్రయోగశాల'ను ఏర్పాటుచేయటానికి భారత్, డెన్మార్క్‌ల మధ్య విజయవంతమైన సహకారాన్ని ఇరు నాయకులు ప్రస్తావించారు. ఇది భారత ప్రభుత్వం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - బనారస్ హిందూ యూనివర్సిటీ (ఐఐటీ-బీహెచ్‌యూ), డెన్మార్క్ ప్రభుత్వం కలిసి చేపట్టిన ఒక విశిష్టమైన త్రైపాక్షిక కార్యక్రమం. ఇరు దేశాల నాయకులు మొబిలిటీ భాగస్వామ్యంపై కూడా చర్చించారు.

పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా ఇరు దేశాల నాయకులు అభిప్రాయాలను పంచుకున్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ప్రస్తుతం తాత్కాలిక సభ్య దేశంగా ఉన్న డెన్మార్క్ పదవీకాలం విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.

భారత్-నార్డిక్ మూడో శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఐస్‌లాండ్ ప్రధానితో సమావేశమైన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, వే 21:భారత్-నార్డిక్ మూడో శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఓస్లో వేదికగా ఐస్‌లాండ్ ప్రధానమంత్రి శ్రీమతి క్రిస్ట్రన్ ఫ్రాస్టాడోట్టిర్‌తో సమావేశమయ్యారు.

ఐస్‌లాండ్ ప్రధానమంత్రిగా ఫ్రోస్టాడోట్టిర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత... ఈ ఇరువురు నేతల మధ్య ఇది మొదటి సమావేశం. ఐస్‌లాండ్ చరిత్రలోనే అత్యంత విన్న వయస్కురాలైన ప్రధానమంత్రిగా ఘనత సాధించిన ఫ్రోస్టాడోట్టిర్‌కు ప్రధానమంత్రి శ్రీ మోదీ అభినందనలు తెలిపారు.

భారత్-యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఈఎఫ్‌టీఏ)... వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టీఈపీఏ) అమల్లోకి రానున్న నేపథ్యంలో ఇరు దేశాల నేతలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, తయారీ రంగ సహకారంలో ఇరు దేశాల అనలైన సామర్థ్యాన్ని వెలికితీయడానికి టీఈపీఏ అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తుందని ఇరువురు నేతలూ అభిప్రాయపడ్డారు.

జియోథర్మల్ ఎనర్జీ, మత్స్య పరిశ్రమ, వినూత్న సాంకేతికతలు, సృజనాధారిత ఆర్థిక వ్యవస్థ, సంస్కృతి, పర్యాటకం, రవాణా, ప్రజల మధ్య సంబంధాలు వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారం పురోగతిని వారు సమీక్షించారు. ఆర్కిటిక్ పరిశోధనలో సహకారాన్ని పెంపొందించే మార్గాలను ఇరువురు ప్రధానమంత్రులు చర్చించారు.

పరస్పర అనుకూల సమయంలో భారత్‌ను సందర్శించాలని ఐస్‌లాండ్ ప్రధానమంత్రిని... ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆహ్వానించారు.

నిధుల నిర్వహణలో పారదర్శకత, సామర్థ్యం, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే ఆయుష్ అనుదాన్ వేదిక లక్ష్యం: శ్రీ ప్రతాపరావు జాదవ్

న్యూఢిల్లీ, మే 21:ఆయుష్ రంగంలో డిజిటల్ పాలనను బలోపేతం చేయడం, పారదర్శకతను పెంపొందించడం వైపు కీలక ముందడుగు పడింది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ (స్వతంత్ర బాధ్యత), ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్ నేడు న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్‌లో ఆయుష్ అనుదాన్ వేదికను ప్రారంభించారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద వచ్చే నిధుల ప్రతిపాదనలను సమర్పించడం, వాటిని పరిశీలించడం, ఆమోదించడం, పర్యవేక్షించే ప్రక్రియలను సరళతరం చేయడానికి ఆయుష్ గ్రిడ్ కార్యక్రమంలో భాగంగా ఈ వేదికను అభివృద్ధి చేశారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్ మాటాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆయుష్ రంగం కోసం ఒక సమగ్రమైన, పారదర్శకమైన, పౌర కేంద్రిత డిజిటల్ వ్యవస్థను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా భారత ప్రభుత్వం దూరదృష్టితో చేపట్టిన డిజిటల్ కార్యక్రమమే ఆయుష్ గ్రిడ్ అని అన్నారు. ఈ కార్యక్రమం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరిస్తూ "ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సూచించే 'వ్యాపార సౌలభ్యం', 'జీవన సౌలభ్యం' దార్శనికతతో స్ఫూర్తి పొంది ఈ ఆయుష్ అనుదాన్ వేదికను ఒక సమగ్ర డిజిటల్ వేదికగా తీర్చిదిద్దాం'' అని మంత్రి పేర్కొన్నారు.

ఈ వేదిక ఆయుష్ రంగంలోని నిధుల మంజూరు వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తుందని కేంద్రమంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్ తెలిపారు. ఈ వేదిక ప్రాముఖ్యతను వివరిస్తూ "నిధుల నిర్వహణ ప్రక్రియలో 100 శాతం పారదర్శకత, సామర్థ్యం, జవాబుదారీతనం, సులభతరమైన అందుబాటును నిర్ధారించడమే ఈ వేదిక ప్రాథమిక లక్ష్యం" అని ఆయన అన్నారు. సంస్థలు, సంస్థాగత విభాగాలు తమ ప్రతిపాదనలను పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే సమర్పించేలా వీలు కల్పించడం ద్వారా ఈ వేదిక కాగిత రహిత పాలనపై ప్రభుత్వ దార్శనికతను ప్రోత్సహిస్తుందని ఆయన తెలిపారు.

ఈ వేదికను ఎన్‌జీవో దర్పణ్ పోర్టల్‌తో అనుసంధానం చేయడం వల్ల దరఖాస్తు చేసుకునే సంస్థల గుర్తింపు, ధ్రువీకరణ ప్రక్రియ మరింత వేగంగా, స్వయంచాలితంగా, నమ్మదగినదిగా, దోష రహితం గా మారుతుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ నిబంధనలకు అనుగుణంగా ఉన్న ఆయుష్ గ్రిడ్ కార్యక్రమం కింద విద్య, పరిశోధన, ఆరోగ్య సేవలు, ఔషధ మొక్కల పరిపాలన, ఔషధ నియంత్రణ, సామర్థ్య పెంపు, ప్రపంచవ్యాప్త ప్రచారం వంటి రంగాల్లో ఇప్పటికే అనేక డిజిటల్ వేదికలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. దీని ద్వారా పారదర్శకమైన, పౌర స్నేహపూర్వక సేవలందిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమానికి ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటెచా, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ కవితా జైన్, శ్రీమతి అలర్మేల్‌మంగై, కుమారి మోనాలిసా డాష్, ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆయుష్ అనుదాన్ వేదిక ద్వారా వివిధ సంస్థలు, సంస్థాగత విభాగాలకు తమ నిధుల ప్రతిపాదనలను ఒక క్రమబద్ధమైన, సులభతరమైన ఇంటర్‌ఫేస్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. ఇంతకముందు ఉన్న మానవ ప్రయత్నంతో కూడిన ,కాగిత ఆధారిత విధానాలపై ఆధారపడాల్సిన అవసరాన్ని ఇది పూర్తిగా తొలగిస్తుంది. ఎన్‌జీవో దర్పణ్ వేదికతో దీనిని అనుసంధానించడం వల్ల దరఖాస్తు చేసుకునే సంస్థల గుర్తింపు, ధృవీకరణ ప్రక్రియ చాలా సులభంగా జరుగుతుంది. ఇది సంస్థల విశ్వసనీయతను పెంచడంతో పాటు, తనిఖీ ప్రక్రియలను మరింత వేగవంతం చేస్తుంది.

ఈ వేదిక ముఖ్య లక్షణాల్లో ఒకటి పథకాల వారీ దరఖాస్తుల నిర్వహణ. దీని ద్వారా మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల నిర్దిష్ట నిబంధనలకు అనుగుణంగా ప్రతిపాదనలను వర్గీకరించడం, పరిశీలించడం, పర్యవేక్షించడం సాధ్యమవుతుంది. ఈ వేదికలో తక్షణ అప్లికేషన్ ట్రాకింగ్ సౌకర్యాన్ని కూడా చేర్చారు. దీనివల్ల దరఖాస్తుదారులు, సంబంధిత అధికారులు ప్రతిపాదనల స్థితి ఏ దశలో ఉందో ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా పర్యవేక్షించవచ్చు.

నిధుల మంజూరు ప్రక్రియలలో పారదర్శకత, కార్యాచరణ సామర్థ్యం, జవాబుదారీతనం, సులభతరమైన అందుబాటును నిర్ధారించడమే లక్ష్యంగా ఆయుష్ అనుదాన్ వేదికను ప్రారంభించారు. ఈ చర్య డిజిటల్ పరివర్తన, పారదర్శక పాలన, డిజిటల్ ఇండియా దార్శనికతకు అనుగుణంగా బలమైన, ఆవిష్కరణలతో కూడిన, డిజిటల్ సాధికారత కలిగిన ఆయుష్ వ్యవస్థను సృష్టించడం పట్ల మంత్రిత్వ శాఖకు ఉన్న నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

ఈ వేదికను ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన సింగిల్-విండో డిజిటల్ కార్యక్రమమైన ఎంఏఐఎన్‌వీ(వైౖ ఆయుష్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ పోర్టల్) ద్వారా గానీ, లేదా నేరుగా ఆయుష్ అనుదాన్ వేదిక లింక్ ద్వారా గానీ దీనిని ఉపయోగించవచ్చు.

ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి మేజర్ జనరల్ భువన్ చంద్ర ఖండూరీ (రిటైర్డ్) మృతికి సంతాపం తెలిపిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మే 21:ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి మేజర్ జనరల్ భువన్ చంద్ర ఖండూరీ (రిటైర్డ్) మృతికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు విచారాన్ని వ్యక్తం చేశారు.

సాయుధ దళాల నుంచి రాజకీయ రంగం వరకూ– మేజర్ జనరల్ ఖండూరీ అమూల్య సేవలను అందించారనీ, ఈ కారణంగా ఆయనను సదా స్మరించుకుంటామనీ ప్రధాన మంత్రి అన్నారు. ముఖ్యమంత్రిగా మేజర్ జనరల్ ఖండూరీ పదవీకాలంలో ఉత్తరాఖండ్ అభివృద్ధి పట్ల అచంచల అంకిత భావాన్ని కనబరిచారని శ్రీ మోదీ స్పష్టం చేశారు. కేంద్ర మంత్రిగా శ్రీ ఖండూరీ పదవీకాలం కూడా సరైన అర్థంలో స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. దేశవ్యాప్తంగా అనుసంధాన వ్యవస్థను గణనీయంగా మెరుగుపరచడానికి శ్రీ ఖండూరీ అవిశ్రాంతంగా కృషి చేశారని ప్రధాని ప్రశంసించారు.

ఈ శోక ఘడియలో దివంగత నేత కుటుంబానికీ, మద్దతుదారులకీ ప్రధానమంత్రి హృదయపూర్వక సంతాపాన్ని వ్యక్తం చేశారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి పొందుపరుస్తూ :

"ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి మేజర్ జనరల్ భువన్ చంద్ర ఖండూరీ (రిటైర్డ్) ఇక లేరని తెలిసి చాలా బాధ పడ్డాను. సాయుధ దళాల మొదలు రాజకీయ రంగం వరకూ ఆయన అమూల్యమైన సేవలను అందించారు. ఇందుకు ఆయన్ను ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. ఉత్తరాఖండ్ అభివృద్ధి కోసం అంకిత భావంతో పని చేశారు. ఇది ముఖ్యమంత్రిగా ఆయన పదవీకాలంలో స్పష్టంగా కనిపించింది. కేంద్ర మంత్రిగా కూడా ఆయన పదవీకాలం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిని అందిస్తుంది. దేశవ్యాప్తంగా అనుసంధానాన్ని మెరుగుపరచడానికి ఆయన నిరంతరం అలుపెరుగని ప్రయత్నాలు చేశారు. ఈ శోక ఘడియలో ఆయన కుటుంబానికీ, ఆయన మద్దతుదారులకీ సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఓమ్ శాంతి" అని పేర్కొన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దు

-పేదల పొట్ట కొడుతున్న కేంద్ర ప్రభుత్వం

-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్

అమరావతి, మే 21:పల్నాడు జిల్లా, చిలకలూరిపేట రూరల్ మండలం వేలూరు గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల దగ్గరికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్ వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, కొత్తగా 'జీ రామ్ జీ' చట్టాన్ని జూలై మాసం నుండి అమలు చేయనుందని ఆరోపించారు. ఈ కొత్త చట్టం వల్ల రాబోయే రోజుల్లో ఉపాధి కూలీలు పని డిమాండ్ చేసే హక్కును కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కూడా 40 శాతం నిధులు ఖర్చు పెట్టవలసి ఉంటుందని, ఎక్కడ పనులు చేయాలో కూడా కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుందని తెలిపారు. డబ్బులు రాష్ట్రానివి, పెత్తనం మోడీదన్నట్లుగా ఈ విధానం ఉందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈ 'జీ రామ్ జీ' చట్టాన్ని వ్యతిరేకించాలని, ఈ చట్టాన్ని తాము అమలు చేయలేమని, దీనివల్ల రాష్ట్రంపై పెను భారం పడుతుందని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. అంతవరకు ఉపాధి కూలీలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

గత 20 సంవత్సరాలుగా ఉపాధి హామీ చట్టం సాధించిన ప్రగతి తక్కువేమీ కాదని, కరవు సమయాల్లో ఈ పథకం లేకపోతే లక్షలాది మంది ఇబ్బందులు పడేవారని, అంత గొప్ప పథకాన్ని రద్దు చేసి పేదల పొట్ట కొట్టడం తగదని అన్నారు. ఉపాధి హామీ చట్టం వ్యవసాయ ఉత్పత్తిని మెరుగుపరిచి, కుటుంబాల ఆదాయాన్ని పెంచడం ద్వారా గ్రామీణ పేదల జీవన ప్రమాణాలపై సానుకూల ప్రభావం చూపిందని కొనియాడారు. ఈ చట్టం వల్ల గ్రామీణ కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగాయని, కుల అంతరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో నిరుపేద వ్యవసాయ కార్మికులు భూస్వాములపై ఆధారపడకుండా ఈ పథకం కాపాడిందని గుర్తు చేశారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు కేటాయించాలని, ఈ నిధులను ఇతర రంగాలకు వాడకూడదని చట్టం స్పష్టంగా చెబుతోందని అన్నారు.

ఉపాధి కూలీలకు పని ప్రాంతాలలో ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నప్పుడు సేద తీరడానికి గుడారాలు ఏర్పాటు చేయాలని, వడదెబ్బ తగిలినప్పుడు ఫస్ట్ ఎయిడ్ కింద మెడికల్ కిట్లు, తాగునీరు, మజ్జిగ అందించాలని చట్టంలో ఉందని తెలిపారు. అలాగే 100 రోజులు పని పూర్తి చేసుకున్న ప్రతి ఉపాధి కూలీకి గడ్డపారలు, పనిముట్లు ఇవ్వాలని, పని కోరిన 15 రోజుల్లోగా పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలని పేర్కొన్నారు.

చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకంతో పాటు దాదాపు 108 రకాల ఇతర పనులను ఉపాధి కూలీల ద్వారానే చేసుకోవచ్చని గ్రామీణ పేదలకు ఉపయోగపడే విధంగా నాటి యూపీఏ ప్రభుత్వం ఈ చట్టం చేసిందని గుర్తు చేశారు. కానీ ఇక్కడి అధికారులు మాత్రం ఈ నిబంధనలను చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పనులు ఎలా జరుగుతున్నాయో పరిశీలించాలని వ్యవసాయ కార్మిక సంఘం తరఫున కోరారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి దాసరి వరహాలు, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి చౌటుపల్లి నాగేశ్వరరావు, చౌటుప్పల్ సుబ్బారావు, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ భూములను ఇతర వినియోగాలకు మార్చొద్దు

-రీ-సర్వేలో అటవీ-రెవెన్యూ శాఖల సమన్వయం కీలకం..

-జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

అమరావతి, మే 21: అటవీ భూములు మరియు రెవెన్యూ భూములకు సంబంధించి రికార్డుల నవీకరణ, రీ-సర్వే ప్రక్రియలను పూర్తి స్పష్టతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అటవీ, రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ అటవీ మరియు రెవెన్యూ డివిజనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అటవీ భూముల వివరాల సేకరణకు ప్రత్యేక ప్రోఫార్మాలు రూపొందించినట్లు తెలిపారు. అటవీ మరియు రెవెన్యూ భూములకు సంబంధించిన అన్ని వివరాలను సూచించిన ప్రోఫార్మా-1 ప్రకారం పూర్తిస్థాయిలో నమోదు చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఫారెస్ట్ తరహా భూములకు సంబంధించి రెండు వేర్వేరు ప్రోఫార్మాల్లో, అలాగే సి.ఏ. ల్యాండ్స్ కు సంబంధించిన వివరాలను మూడో ప్రోఫార్మాలో పొందుపరిచి, పూర్తి సమాచారంతో సమగ్ర నివేదికలు అందించాలని సూచించారు. ఏ భూమి అటవీ భూమి ఫారెస్ట్ ల్యాండ్ ఏది రెవెన్యూ భూమి అనే అంశాన్ని రికార్డుల ఆధారంగా ఖచ్చితంగా నిర్ధారించాలని సూచించారు. ఫారెస్ట్ శాఖ ద్వారా రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయబడిన భూములు లేదా ఆర్.ఎస్.ఆర్ (ఖీూఖీ) రికార్డుల్లో ఫారెస్ట్‌గా నమోదైన ప్రాంతాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర వినియోగాలకు మార్చరాదని స్పష్టం చేశారు. అటవీ భూములను అటవీ ప్రాంతాలుగానే పరిరక్షించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

భూములపై వ్యక్తులకు పట్టాలు ఉన్నప్పటికీ, రెవెన్యూ రికార్డుల్లో ముందుగా సంబంధిత భూములను "ఫారెస్ట్"గా అప్‌డేట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం చట్టపరమైన మరియు పరిపాలనా పరమైన అంశాలను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. జిల్లాలో 200కుపైగా గ్రామాల్లో రీ-సర్వే వేగంగా కొనసాగుతోందని, ఫారెస్ట్ బౌండరీల నిర్ణయంలో వివాదాలు తలెత్తకుండా ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వేయర్లతో పాటు అటవీశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బౌండరీ ఫిక్సేషన్ సమయంలో ఫారెస్ట్ శాఖకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం ఇవ్వాలని, సంబంధిత సర్వేయర్లు మరియు అధికారులకు లిఖితపూర్వక కమ్యూనికేషన్ పంపాలని ఆదేశించారు.

రీ-సర్వే షెడ్యూల్‌ను ఫేజ్‌వైజ్‌గా డీఎఫ్‌ఓలకు వెంటనే పంపించాలని, గ్రామ సభలు లేదా ఫీల్డ్ సందర్శనలకు కనీసం వారం ముందు అటవీ శాఖకు సమాచారం అందేలా చూడాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వెబ్‌ల్యాండ్‌లో అటవీ భూములుగా నమోదైన సర్వే నంబర్లు, ఫారెస్ట్ లైక్ ఏరియాస్, సి.ఏ ల్యాండ్స్‌కు సంబంధించిన వివరాలను సమగ్రంగా సేకరిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో పొరపాటున రెవెన్యూ భూములుగా భావించి పట్టాలు జారీ చేసిన ప్రాంతాలు, సాగులో ఉన్న అటవీ భూములను గుర్తించి తిరిగి ఫారెస్ట్ శాఖకు అప్పగించే అంశంపై కూడా పరిశీలించాలన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాలు, రెవెన్యూ రికార్డుల్లో అడవిగా నమోదైన భూములు, బయోడైవర్సిటీ కలిగిన ఫారెస్ట్ లైక్ ఏరియాస్‌ను మూడు కేటగిరీలుగా విభజించి నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డోన్ మండలంలో "అడవి పోరంబోకు'' నామకరణంతో ఏర్పడిన సమస్యపై సమగ్ర పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. కొత్తకోట గ్రామంలో రెవెన్యూ రికార్డుల్లో ఇంకా అటవీ భూమిగా నమోదై ఉన్న 110 ఎకరాల భూమిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. బనగానపల్లి పరిధిలో ప్రైవేట్ ఆధీనంలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ భూములపై రీ-చెక్ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశం చారు. పాములపాడు మండలంలో ఆర్.ఓ.ఎఫ్.ఆర్ నోటిఫికేషన్ మరియు మ్యాపింగ్ మధ్య ఉన్న వ్యత్యాసాలపై సమగ్ర సర్వే నిర్వహించి మే 26లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అలాగే అజెండా-1, అజెండా-2లకు సంబంధించిన అన్ని వివరాలను మే 25లోగా కలెక్టరేట్‌కు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రికవరీ ఏజెంట్ల వేధింపులపై కఠిన చర్యలు

అమరావతి, మే 21: బ్యాంకు రుణగ్రహీతలకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ఊరట నిచ్చింది. లోన్ రికవరీ పేరుతో కస్టమర్లను వేధిస్తున్న ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఆర్‌బీఐ కొత్త డ్రాఫ్ట్ నిబంధనలు విడుదల చేసింది. అక్టోబర్ 1 నుంచి ఈ కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి.కొన్ని బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు రికవరీ ఏజెంట్ల ద్వారా కస్టమర్లపై ఒత్తిడి తెస్తున్నాయన్న ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. రుణ వసూళ్ల పేరుతో బెదిరింపులు, అసభ్య ప్రవర్తన, వ్యక్తిగత వేధింపులు చేయడం పూర్తిగా నిషేధిస్తామని స్పష్టం చేసింది.కొత్త మార్గదర్శకాలను ఉల్లంఘించిన బ్యాంకులు, రికవరీ ఏజెంట్లపై సీరియస్ యాక్షన్ తీసుకుంటామని ఆర్‌బీఐ హెచ్చరించింది. రుణగ్రహీతల హక్కులను రక్షించడంతో పాటు బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంచడమే ఈ నిర్ణయాల లక్ష్యమని తెలిపింది.

విజిబుల్ క్లీన్‌లినెస్ లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ

నంద్యాల,మే 21: జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్, బేతంచర్ల మున్సిపాలిటీల పరిధిలో పరిశుభ్రతను మరింత మెరుగుపర్చేందుకు నాలుగు వారాల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ నరేష్ కుమార్ ''విజిబుల్ క్లీన్‌లినెస్" కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, అన్ని మున్సిపల్ పట్టణాల్లో వచ్చే నాలుగు వారాల్లో విజిబుల్ క్లీన్‌లినెస్ లక్ష్యాన్ని సాధించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా మొదటి వారంలో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్ ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు వంటి ప్రజా రద్దీ ప్రదేశాల్లో పాన్, గుట్కా ఉమ్మివేతల వల్ల ఏర్పడిన ఎరుపు మచ్చలు, బహిరంగ మూత్రవిసర్జన ప్రాంతాల్లో కనిపించే పసుపు మచ్చలను గుర్తించి పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని తెలిపారు. రోడ్లను పూర్తిగా శుభ్రం చేయడంతో పాటు డివైడర్లు, కర్బ్‌లైన్లు, ఫుట్‌పాత్‌లకు పెయింటింగ్ చేపట్టాలని, స్పీడ్ బ్రేకర్లను మరమ్మతులు చేసి తెల్లటి గుర్తులు వేయాలని, రహదారుల ఇరువైపులా సైడ్ మార్కింగ్ పనులు కూడా పూర్తి చేయాలని ఆదేశించారు.

రెండవ వారంలో అన్ని రకాల డ్రైనేజీ కాలువలను పూర్తిగా శుభ్రపరిచి, మురుగునీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రెయిన్ల శుభ్రతపై ప్రత్యేక మానిటరింగ్ నిర్వహించాలని అధికారులకు తెలిపారు. అలాగే మూడవ వారంలో వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, మార్కెట్లు, రైతు బజార్లలో ఎక్కువ మొత్తంలో చెత్త ఉత్పత్తి చేసే బల్క్ వేస్ట్ జనరేటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యాపారులు రోడ్లపై చెత్త వేయకుండా ప్రత్యేక చెత్త సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా అవగాహన కల్పించాలన్నారు. ఆన్-సైట్ కంపోస్టింగ్, బయోడైజెస్టర్ ప్లాంట్ల వినియోగంపై కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌కు అడ్వైజరీ నోట్లు జారీ చేయాలని పేర్కొన్నారు. చివరిగా నాల్గవ వారంలో అన్ని పబ్లిక్ టాయిలెట్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు, పాత చెత్త నిల్వ కేంద్రాలు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు, ఖాళీ స్థలాలను పూర్తిగా శుభ్రపరచాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో చెత్త పేరుకుపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నాలుగు వారాల కార్యక్రమంలో చేపట్టిన పనులన్నింటినీ సమగ్రంగా క్రోడీకరించి నివేదిక రూపంలో ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలు, అధికారిక కార్యక్రమాల సమయంలో జిల్లాలో చేపట్టిన పరిశుభ్రత చర్యలు ప్రతిష్టాత్మకంగా కనిపించేలా ఉండాలని అన్నారు. పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలు, జడ్జీలు రానున్న నేపథ్యంలో అన్ని మున్సిపాలిటీలు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, ప్రతి ప్రాంతంలో పరిశుభ్రత స్పష్టంగా కనిపించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

షార్ట్ సర్క్యూట్ తో 350 బస్తాల మొక్కజొన్న దగ్ధం

ప్రభుత్వం ఆదుకోవాలని రైతు పొగాకు శ్రీనివాస్ అభ్యర్థన

నల్గొండ, మే 21:దుగ్గొండి మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో అమ్మకానికి సిద్ధంగా పెట్టుకున్న 350 బస్తాల మొక్కజొన్నలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది.ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకున్నది. వెంకటాపురం శివారు బీసీ కాలనీకి చెందిన పొగాకు శ్రీనివాస్ అనే రైతు ప్రభుత్వ గిడ్డంగుల గోదాము సమీపంలో గల తన రెండు ఎకరాల మీద మొక్కజొన్న పంటను కోసి జొన్నలను కుప్పలుగా పేర్చి ఉంచారు.

గురువారం ఉదయం వీచిన గాలికి సమీపంలో ఉన్న కరెంటు తీగలు ఒకదానికే ఒకటి తగిలి షార్ట్ సర్క్యూట్ తో నిపుల్ చిలరేగి మొక్కజొన్నలు పూర్తిగా దగ్ధమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న మొక్కల విలువ సుమారు మూడు లక్షలు ఉంటుందని రైతు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో నష్టపోయిన తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దాతల నుండి అందుతోన్న సహకారం ఎంతో గొప్పది-ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు, మే 21: ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో స్ఫూర్తివంతమైన సేవలను ఆదర్శవంతంగా ముందుకు తీసుకెళ్ళేందుకు ప్రత్యేక దృష్టిసారించినట్లు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడించారు. ఇదే తరుణంలో దాతలు స్పందిస్తోన్న తీరు ఎంతో అమోఘమని ఎమ్మెల్యే కొనియాడారు. అవసరార్థులకు సమయానికి వివిధ రూపాల్లో అందించే సేవలు ఎంతో నిరుపమానమైనవని భావించే ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఆ దిశగా వాటిని ఎంతో ఆదర్శవంతంగా ముందుకు తీసుకెళ్తూ వస్తున్నారు.

ఇదే క్రమంలో ప్రతి గురువారం వైద్య శిబిరం నిర్వహించాలనే ఉన్నతాలోచనతో దాన్ని ఆచరణలోనూ పెట్టారు. దీంతో ఏలూరు పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ప్రతి గురువారం ఉచిత వైద్య శిబిరం ఎంతో ఆదర్శవంతంగా కొనసాగుతోంది. దీనిలో భాగంగా ఈ గురువారం కూడా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ద్వారా అనేక మంది అవసరార్థులు వైద్య సేవలు పొందారు. శిబిరానికి విచ్చేసిన వారికి వైద్యులు, వైద్య సిబ్బంది బీపీ, షుగర్ వంటి వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వైద్య శిబిరం కొనసాగుతోన్న తీరును స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే బడేటి చంటి, పలువురికి ఉచితంగా మందులను అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, తాను చేయాల నుకున్న మంచిపనికి దాతల నుండి అందుతోన్న సహకారం కూడా ఎంతో గొప్పదన్నారు. ఈ గురువారం వైద్య శిబిరానికి విచ్చేసే రోగులకు కైకలూరుకు చెందిన కృష్ణ మెడికల్స్ అధినేత రాధాకృష్ణ మూర్తి సాధారణ వ్యాధులకు సంబంధించి ఉచితంగా మందులను అందజేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడిన ఎమ్మెల్యే చంటి, రానున్న రోజుల్లో నెలకి ఒకసారి ఒక్కో స్పెషలిస్టు వైద్యుని తో శిబిరంలో ఉచిత వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సేవలను అవసరార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

25 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

-జిల్లాలో 43 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
-పరీక్షలను పటిష్ట ఏర్పాట్లతో సమర్థవంతంగా నిర్వహించాలి
-జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.

ఏలూరు, మే 21: ఈ నెల 25 వతేదీ నుంచి ప్రారంభం కానున్న ఎస్ఎస్ సి మరియు ఇంటర్మీడియట్ (ఏ.పి.ఓ. ఎస్.ఎస్)అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఎస్ఎస్ సి, ఇంటర్మీడియట్ (ఏ.పి.ఓ. ఎస్.ఎస్) అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహణపై గురువారం సంబంధిత జిల్లా అధికారులతో జిల్లా కలెక్టరు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 43 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందులో పదవ తరగతి పరీక్షలకు 30 పరీక్ష కేంద్రాలు, ఎస్ ఎస్ సి (ఏ.పి.ఓ.ఎస్.ఎస్) పరీక్షలకు 11, ఇంటర్మీడియట్ (ఏ.పి.ఓ.ఎన్.ఎస్) కు 02 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పదవ తరగతి పరీక్షలకు 5,226 మంది, ఎస్ఎస్ సి (ఏ.పి.ఓ.ఎస్.ఎస్) పరీక్షలకు 479 మంది, ఇంటర్మీడియట్ (ఏ.పి.ఓ.ఎస్.ఎస్) కు 364 మంది పరీక్షలకు హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. మే 25వ తేదీ నుంచి జూన్ 4 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటలు వరకు పరీక్షలు జరుగుతాని తెలిపారు. పరీక్ష గదుల్లోకి ఇన్విజిలేటర్లు, సిబ్బంది, విద్యార్థులు ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకు రాకూడదన్నారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. పరీక్షలు నిర్వహణకు 21 స్టోరేజీ పాయింట్లను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఈ పరీక్షలు నిర్వహణకు 40 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 40 మంది డిపార్ట్ మెంటల్ అధికారులను, 7 ఫ్లైయింగు స్వాడ్లను, 5 గురు రూటు ఆఫీసర్లను,5 గురు సహాయ రూటు ఆఫీసర్లను, 260 మంది ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందని అన్నారు. ఆయా మండలాల్లోని పరీక్షా కేంద్రాలు పరిధిలో సెక్షన్ 144 అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో జీరాక్స్ కేంద్రాలను, ఇంటర్ నెట్ సెంటర్లను మూసివేసేలా సంబంధిత తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్ష సమయంలో ఎటువంటి విద్యుత్తు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్తు శాఖ ఎస్ఇని జిల్లా కలెక్టరు ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లను, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని జిల్లా కలెక్టరు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ఫర్నిచరు, చల్లటి త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు ఏలూరు, నూజీవీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా సమయానికి అనుగుణంగా గ్రామీణ విద్యార్థులు సంబంధిత పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరేలా బస్సు సర్వీసులు సమయాన్ని రీషెడ్యూల్ చెయ్యాలని ఏపీఎన్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, పరీక్షలు నిర్వహణ సహాయ కమిషనరు ఆర్.ఆశ, సంబంధిత వివిధ శాఖలు అధికారులు వారి వారి కార్యాలయంలో నుండి హాజరైనారు.

కొండవీడు కోట అభివృద్ధికి నూతన రహదారుల ప్రతిపాదన

-కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

అమరావతి, మే 21:పల్నాడు జిల్లాలోని చారిత్రాత్మక కొండవీడు కోటను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు, జాతీయ రహదారుల నుండి కోటకు మెరుగైన కనెక్టివిటీ కల్పించాలని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు, టీడీపీ లోక్‌సభ పక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ.. కొండవీడు కోట పర్యాటక ప్రగతికి రెండు కీలకమైన 4 లేన్ల అనుసంధాన రహదారులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. కొండవీడు కోటకు వందల ఏళ్ల వైభవ చరిత్ర ఉందన్నారు. 14వ శతాబ్దంలో రెడ్డి రాజుల కాలంలో నిర్మితమై, విజయనగర సామ్రాజ్య వైభవానికి సాక్ష్యంగా నిలిచిన కొండవీడు కోటను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు కేంద్ర మంత్రికి వివరించారు. ఈ చారిత్రక ప్రాంతానికి మెరుగైన రహదారులు అందుబాటులోకి వస్తే పర్యాటకంగానే కాకుండా, సామాజికంగా, ఆర్థికంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

కోట పర్యాటక అభివృద్ధికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు రెండు ముఖ్యమైన రహదారులను ప్రతిపాదించారు. ఇందులో మొదటిది అనంతపూర్ - గుంటూరు జాతీయ రహదారి 544ఆ జంక్షన్ అయిన ఫిరంగిపురం నుండి గణేశ్వరపాడు వరకు దాదాపు 3 కిలోమీటర్ల మేర 4 లేన్ల రహదారి కాగా, రెండోది చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి 16 జంక్షన్ అయిన బోయపాలెం నుండి గణేశ్వరపాడు వరకు దాదాపు 6 కిలోమీటర్ల మేర 4 లేన్ల రహదారి. మొత్తం 9 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రెండు అనుసంధాన రహదారుల నిర్మాణ పనులు వీలైనంత త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు.

విష వాయువు పీల్చి ఒకరు మృతి

-ఇద్దరు పరిస్థితి విషమం
-రైస్ మిల్లులో ఆక్వా వ్యర్థాలు ప్రాసెసింగ్
-పరిశ్రమ అనుమతులపై స్పష్టత ఇవ్వని అధికారులు
-ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్ బోర్డు తొలగించడం పై సందేహాలు

అమరావతి, మే 21:కొందరి నిర్లక్ష్యానికి, మరికొందరి ధన దాహానికి నిండు ప్రాణాలు బలైపోతూనే ఉన్నాయి. క్షేత్రస్థాయి పరిశీలనలు, తనిఖీలు లేకుండానే పశ్చిమగోదావరి జిల్లాలో ఎన్నో పరిశ్రమలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. ఏదో ఒక ప్రమాదం, సంఘటన గాని జరిగినప్పుడే అసలు విషయం బయటకు వస్తుంది. తాజాగా భీమవరంలో ఓ ఆక్వా వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్ ప్రాంతంలో జరిగిన సంఘటనలో ఓ వ్యక్తి మృత్యువాత పడగా మరో ఇద్దరు ప్రాణాల కోసం పోరాడుతున్నారు.

భీమవరం లోని ఆరేట్ నగర్ లో పాత రైస్ మిల్లులో ఆక్వా వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్ ను నిర్వహిస్తున్నారు. పైకి రైస్ మిల్ కలరింగ్ ఇస్తూ లోపల ఆక్వా వ్యర్థాలను ప్రోసెసింగ్ చేస్తున్నారు. డ్రైనేజీ వ్యర్థాలను వెళ్లే మార్గం పూడిక పోవడంతో భీమడోలు మండలం గుండుగొలను నుంచి ఎనిమిది మంది కూలీలను ఆ పరిశ్రమ వారు తీసుకు వచ్చారు. రైస్ మిల్లు ప్రాంతంలో షీల్డ్ తొలగించాలని తీసుకొచ్చి రైస్ మిల్లు వ్యర్థాలకు సంబంధించి కాకుండా ఆక్వా వ్యర్థాలకు సంబంధించి డ్రెయిన్ లో దింపారని బాధితులు చెబుతున్నారు. పనిచేస్తున్న సమయంలో విష వాయువులు వెలువడటంతో పని చేస్తున్న వలపు వెంకన్న (45) మృతి చెందాడు. ఇతనితో పాటు పనిచేయటానికి వచ్చిన వలపు రాజు, బత్తుల ప్రభాకర్ తీవ్ర అనారోగ్యం పాలవడంతో హుటాహుటిన భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్ నుంచి వచ్చిన విషవాయువు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందంటున్నారు.

ఇక్కడ నిర్వహించే ఈ పరిశ్రమపై స్థానికులు, వాహనదారులు గతంలో పలుమార్లు తమ ఆందోళనను తెలియజేసిన కనీసం పట్టించుకునే వారు కరువయ్యారు. పరిశ్రమ నిర్వహించే వారికి అన్ని రకాల అండదండలు ఉండటంతో తమను ఎవరు ఏమి చేయలేరని ధీమాతో ఈ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పైసలతో కప్పిపుచ్చుకునే అవకాశం ఉండడంతో ఇటువంటి ప్రమాదాలు మరో మారు పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం పటిష్ట తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాధితులకు అండగా నినాదాలు.. అరెస్టులు

విషవాయువుల ప్రమాదంలో మృతి చెందిన వెంకన్న కుటుంబానికి న్యాయం చేయాలంటూ, నష్టపరిహారాన్ని ప్రకటించాలంటూ సిఐటియు సిపిఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి వైద్యుల నుండి వారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి సిబ్బందిని ఆదేశించారు. తదుపరి అధికారులు సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై వివరాలు అరాతీశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇంచార్జ్ కలెక్టర్ పరామర్శ

ఈ ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, డీఎస్పీ రఘువీర్ విష్ణు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి వైద్యుల నుండి వారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి సిబ్బందిని ఆదేశించారు. తదుపరి అధికారులు సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై వివరాలు అరాతీశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనకు చిత్తూరు పోలీసుల పటిష్ట భద్రత

-యాదమరిలో అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజనింగ్ కార్యక్రమం నిర్వహణ
-హెలిప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాల పరిశీలన

చిత్తూరు,మే 21: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 23న చిత్తూరు జిల్లా యాదమరి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో జిల్లా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యమంత్రి వర్యటనకు సంబంధించి గురువారం అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొని ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. హెలిప్యాడ్ ప్రాంతం, సభా ప్రాంగణం, యాదమరి హెల్త్ కేర్ యూనిట్, ప్రజల పార్కింగ్ స్థలాలు, వీఐపీ పార్కింగ్ ప్రాంతాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద భద్రతా చర్యలు, అగ్నిమాపక సదుపాయాలు, బారికేడింగ్, వైద్య సేవలు, రూట్ మ్యాప్ అందుబాటు, ట్రాఫిక్ నియంత్రణ, జనసామూహిక నియంత్రణ చర్యలపై ఎస్పీ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల వాహనాల పార్కింగ్, వీఐపీ వాహనాల పార్కింగ్ నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు.

ముఖ్యమంత్రి ప్రారంభించనున్న సంజీవని ప్రాజెక్టు ఏర్పాటు చేసిన యాదమరి హెల్త్ కేర్ సెంటర్‌తో పాటు సభా ప్రాంగణాన్ని ప్రత్యేక భద్రతా ప్రాంతాలుగా గుర్తించి సమగ్ర పరిశీలన నిర్వహించారు. ముఖ్యమంత్రి వర్యటన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు.

ఫైర్ సర్వీసులు, ఆరోగ్య శాఖ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పోలీసు బందోబస్తు, డ్రోన్ మానిటరింగ్, వీఐపీ మూమెంట్స్, ప్రజల రాకపోకలు, పార్కింగ్ నిర్వహణ వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి స్థాయిలో అధికారులు అప్రమత్తంగా పనిచేస్తూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఎస్పీ డాక్టర్ తరుణ్ పహ్వా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ దేవదాస్, చిత్తూరు ఎన్‌డీపీవో జె. వెంకటనారాయణ, ఫైర్ అధికారులు, ఎమ్మార్వో, యాదమరి ఎస్ఐ ఈశ్వరయ్య, ఎంపీడీవో తదితర అధికారులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

జైనూర్, మే 21: కొవలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొమరం భీం అసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కేంద్రంతో పాటు చలివేంద్రాన్ని ఆశిఫాబాద్ ఎమ్మెల్యే కొవలక్ష్మి ప్రారంభించారు. ఎమ్మెల్యే నాయకులతో సర్పంచ్లతో కలిసి ప్రజలకు స్వయంగా అంబలి పంపిణీ చేశారు. అంబలి పంపిణి కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన లభించింది.

ఈ నందర్భంగా ఎమ్మెల్యే కొవలక్ష్మి మాట్లాడుతూ వారపు సంతకు వచ్చే ప్రజలకు దాహం తీర్చేందుకు అంబలితోపాటు చల్లని నీళు అందించాలని మానవత్వ దృక్పథంతో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. అంబలి పంపిణి కేంద్రానికి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి అంబలి స్వీకరించి తాగారు. అనంతరం టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నాయకులు మహిళా సర్పంచులు అంబలి పంపిణీ కేంద్రానికి వచ్చిన ప్రజలకు స్వయంగా అంబలి పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్ రావు, బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంతియాజ్ లాల, జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొడప హన్ను పటేల్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్ నాయక్, మహిళా సర్పంచులు లు మడావి కౌసల్య భీమ్రావు, కుమ్ర యశోద కేశవరావు, బాండేర్ సర్పంచ్ కుమ్ర భీమ్రావు, జ0గాం మాజీ సర్పంచ్ కుమ్ర శ్యామ్ రావు, బిఆర్ఎస్ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో 350 బస్తాల మొక్కజొన్న దగ్ధం

-ప్రభుత్వం ఆదుకోవాలని రైతు పొగాకు శ్రీనివాస్ అభ్యర్థన

నల్గొండ, మే 21:దుగ్గొండి మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో అమ్మకానికి సిద్ధంగా పెట్టుకున్న 350 బస్తాల మొక్కజొన్నలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది.ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకున్నది. వెంకటాపురం శివారు బీసీ కాలనీకి చెందిన పొగాకు శ్రీనివాస్ అనే రైతు ప్రభుత్వ గిడ్డింగుల గోదాము సమీపంలో గల తన రెండు ఎకరాల మీద మొక్కజొన్న పంటను కోసి జొన్నలను కుప్పలుగా పేర్చి ఉంచారు.

గురువారం ఉదయం వీచిన గాలికి సమీపంలో ఉన్న కరెంటు తీగలు ఒకదానికే ఒకటి తగిలి షార్ట్ సర్క్యూట్ తో నిపుల్ చిలరేగి మొక్కజొన్నలు పూర్తిగా దగ్ధమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న మొక్కల విలువ సుమారు మూడు లక్షలు ఉంటుందని రైతు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో నష్టపోయిన తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పండించిన మొక్కజొన్నలు దగ్ధం కావడంతో రైతు పొగాకు శ్రీనివాస్ ను స్థానిక సర్పంచ్ శోభారాణి వెంకటేశ్వర్లు గౌడ్ విద్యుత్ ఘాతంతో చేతికొచ్చిన పంట బూడిదైన నేపథ్యంలో వెంకటాపురం సర్పంచ్ పొగాకు శోభారాణి వెంకటేశ్వర్లు గౌడ్ పరామర్శించారు. కాలిపోయిన మొక్కజొన్న రాశులను పరిశీలించారు. విద్యుత్ అధికారులతో పాటు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి దృష్టికి తీసుకువెళ్లి ఆదుకునేందుకు కృషి చేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు .

జెనీవాలో 79వ 'వరల్డ్ హెల్త్ అసెంబ్లీ'ని ఉద్దేశించి ప్రసంగించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా

న్యూ ఢిల్లీ, మే 21:జెనీవాలో 79వ వరల్డ్ హెల్త్ అసెంబ్లీ (డబ్ల్యూహెచ్ఏ) సర్వసభ్య సదస్సును ఉద్దేశించి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా ఈ రోజు ప్రసంగించారు. "అందరి ఆరోగ్యాన్నీ సంరక్షించే" మార్గదర్శక సిద్ధాంతంలో భాగంగా అందరినీ సమానంగా చూస్తూ, అన్ని వర్గాలనూ కలుపుకొని ముందుకు పోతూ, ప్రజల ప్రయోజనాలే పరమార్థంగా స్వాస్థ్య సంరక్షణ సేవల్ని అందించాలని భారత్ దృఢసంకల్పాన్ని చెప్పుకొందని ఆయన పునరుద్ఘాటించారు.

ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యసంరక్షణ రంగానికి కొత్త రూపురేఖలను తీర్చిదిద్దడం: ఉమ్మడి బాధ్యత" ఇతివృత్తంతో ఏర్పాటు చేసిన సదస్సును ఉద్దేశించి శ్రీ నడ్డా ప్రసంగించారు. ఈ సందర్భంగా స్వాస్థ్య సంరక్షణ వ్యవస్థల్ని బలోపేతం చేసే దిశగా భారత్ సమగ్ర విధానాన్ని అనుసరిస్తోందని స్పష్టం చేశారు. "ఏకోన్ముఖ ప్రభుత్వం"తో పాటు "ఏకోన్ముఖ సమాజం" వైఖరిని పాటిస్తూ భారత్ నాణ్యమైన, ఖర్చులు తక్కువగా ఉండే ఆరోగ్య సేవలను అందరి అందుబాటులోకీ తీసుకువచ్చే దిశగా దూసుకుపోతోంది" అని ఆయన వివరించారు.

చౌకైన, నాణ్యమైన స్వాస్థ్య సంరక్షణ సేవల లభ్యతను విస్తరింప చేస్తూ, అందరికీ ఆరోగ్య సేవలందించే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని కేంద్ర ఆరోగ్య మంత్రి స్పష్టం చేశారు. విస్తృత స్థాయి ప్రాథమిక ఆరోగ్యసంరక్షక సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి 1,85,000 కన్నా ఎక్కువ 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల'ను దేశం నలుమూలలా ప్రజా నివాసాలకు సమీపంలో భారత్ ఏర్పాటు చేసిందని అసెంబ్లీకి ఆయన తెలిపారు.

మహమ్మారిని దృష్టిలో పెట్టుకొని తీసుకోదగ్గ సన్నాహక చర్యలతో పాటు, బలమైన ప్రజారోగ్య సంరక్షక వ్యవస్థలను నిర్మించే దిశగా భారత్ చేస్తున్న కృషిని శ్రీ నడ్డా వివరించారు. రాబోయే కాలంలో ప్రజారోగ్యానికి ఎదురు కాగల సవాళ్లను దీటుగా ఎదుర్కొని పరిష్కరించడానికి ఆరోగ్యసంరక్షణ రంగంలో మౌలిక సదుపాయాలతో పాటు అత్యవసర ప్రతిస్పందనపూర్వక సామర్థ్యాల్ని ప్రభుత్వం నిరంతర ప్రాతిపదికన పటిష్టపరుస్తోందని వెల్లడించారు.

ఆరోగ్యసంరక్షణ రంగంలో సాంకేతికత పోషిస్తున్న పరివర్తనాత్మక పాత్రను కేంద్ర మంత్రి ప్రస్తావించారు. ఆయుష్మాన్ భారత్ 88 కోట్లకు పైగా విశిష్ట డిజిటల్ ఆరోగ్య గుర్తింపు కార్డులను (యూనిక్ డిజిటల్ హెల్త్ ఐడీ కార్డ్స్) సిద్ధం చేసి, భారత జాతీయ డిజిటల్ ఆరోగ్య అనుబంధ విస్తారిత వ్యవస్థను బలోపేతం చేస్తోందన్నారు. దీంతో దీర్ఘకాలం పాటు అమల్లో ఉండే స్వాస్థ్య రికార్డులూ, సంరక్షణకు ఉద్దేశించిన నిరంతరాయ, నిరంతర ప్రాతిపదిక కలిగిన సేవలకు మార్గం సుగమం అవుతుందని ఆయన తెలిపారు.

'ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన' విస్తృతినీ, ప్రభావాల్నీ శ్రీ నడ్డా వివరించారు. ఈ పథకం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజారోగ్య హామీ పథకమనీ, సమాజంలో అత్యంత బలహీన వర్గాల ప్రజలు సహా దాదాపు 60 కోట్ల మంది లబ్ధిదారులు ఈ పథకం ద్వారా లబ్ధిని పొందేందుకు అవకాశం ఉందనీ ఆయన అన్నారు.

ఆరోగ్యసంరక్షణ రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) పాత్ర రోజు రోజుకూ పెరుగుతోందని మంత్రి చెబుతూ, ఆరోగ్యసంరక్షణ రంగంలో కృత్రిమ మేధ ఉపయోగానికి సంబంధించిన ఒక వ్యూహాన్ని భారత్ ఇటీవల అమలు చేయడం మొదలుపెట్టిందని ప్రతినిధులకు తెలియజేశారు. నైతికతతో కూడిన, మనిషి ప్రయోజనాలకు ప్రాధాన్యాన్నిచ్చే వ్యవస్థల్ని తీర్చిదిద్దే విషయంలో మన అందరం

మధ్యప్రదేశ్‌లోని ఉర్టన్, ధిరౌలీ గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభం

న్యూ ఢిల్లీ, మే 21:మధ్యప్రదేశ్‌లోని ఉర్టన్, ధిరౌలీ గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కావడంతో భారత దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసే దిశగా బొగ్గు మంత్రిత్వ శాఖ మరో కీలకమైన విజయం సాధించింది. ఈ గనుల్లో కార్యకలాపాలు ప్రారంభం కావడం... దేశీయంగా అందుబాటులోకి వచ్చే బొగ్గు నిల్వలను పెంచుతుందని, ఇంధన రంగంలో స్వావలంబన దిశగా దేశ ప్రయాణాన్ని మరింత వేగవంతం చేస్తుందని భావిస్తున్నారు.

మధ్యప్రదేశ్‌లోని అనుప్పూర్ జిల్లాలో ఉన్న ఉర్టన్ బొగ్గు గనులను జేఎంఎన్ మైనింగ్ ప్రైవేటు సంస్థకు కేటాయించారు. ఈ గనిలో బొగ్గు ఉత్పత్తి 2026 మే 15న ప్రారంభమైంది. వాణిజ్య బొగ్గు వేలం ద్వారా ఉత్పత్తి ప్రారంభించిన మొదటి భూగర్భ బొగ్గు గనిగా ఉర్టన్ నిలిచింది. బొగ్గు రంగంలో చేపడుతున్న సంస్కరణాత్మక మార్పుల్లో ముఖ్యమైన విజయంగా ఇది నిలిచింది.

మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలీ జిల్లాలో ఉన్న ధిరౌలీ బొగ్గు గనిలో కూడా ఉత్పత్తి ప్రారంభం కావడం మరో గణనీయమైన విజయాన్ని సూచిస్తుంది. మహాన్ ఎనర్జెన్ సంస్థకు కేటాయించిన ఈ గనిలో 2026 మే 17న ఉత్పత్తి ప్రారంభమైంది. వనరులు సమృద్ధిగా ఉన్న సింగ్రౌలీ ప్రాంతం నుంచి బొగ్గు సరఫరాను ఇది మరింత పెంచుతుందని అంచనా వేస్తున్నారు.

ఈ రెండు గనుల్లోనూ ఉత్పత్తి ప్రారంభం కావడం... బొగ్గు మంత్రిత్వ శాఖ చేపడుతున్న ప్రగతిశీల సంస్కరణలు, వ్యవస్థీకృత విధానాల ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది. ఇంధన రంగంలో ఆత్మనిర్భరతను సాధించేలా కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడం, వాణిజ్య సౌలభ్యాన్ని అందించడమే లక్ష్యంగా వీటిని మంత్రిత్వ శాఖ చేపడుతోంది. ఈ గనుల నుంచి పెరిగే ఉత్పత్తి... దేశీయంగా పెరుగుతున్న బొగ్గు అవసరాలను తీర్చడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, సుస్థిర ఆర్థిక వృద్ధికి మద్దతు ఇవ్వడం లో కీలక పాత్ర పోషిస్తుంది.

హనోయ్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్,

వియత్నాం ఉప ప్రధాని, రక్షణ మంత్రి జనరల్ ఫాన్ వాన్ జియాంగ్

న్యూ ఢిల్లీ, మే 21:2026 మే 19న హనోయ్‌లో వియత్నాం ఉప ప్రధాని, జాతీయ రక్షణ మంత్రి జనరల్ ఫాన్ వాన్ జియాంగ్‌తో రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. రెండు దేశాల మధ్య వృద్ధి చెందుతున్న రక్షణ భాగస్వామ్యాన్ని నాయకులిద్దరూ సమీక్షించారు. నౌకా వాణిజ్య భద్రత, రక్షణ పరిశ్రమ, శిక్షణ, ప్రాంతీయ స్థిరత్వంలో కొనసాగుతున్న సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాల గురించి చర్చించారు.

ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా మారుతున్న, పరస్పరం ఆసక్తి ఉన్న భద్రతా పరిణామాలపై తమ అభిప్రాయాలను ఉభయ పక్షాలు వంచుకున్నాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతినీ, స్థిరత్వాన్ని, భద్రతనూ, స్వేచ్ఛాయుతమైన, సురక్షితమైన నౌకా వాణిజ్యాన్నీ కొనసాగించేందుకు ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని స్పష్టం చేశాయి. సైనిక శిక్షణ, రక్షణ పారిశ్రామిక సహకారం, నౌకావాణిజ్య భద్రత, సామర్థ్య నిర్మాణం, ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ, సైబర్ భద్రత, అత్యున్నత స్థాయి వినిమయం తదితర అంశాల్లో సహకారాన్ని విస్తరించే మార్గాలపై చర్చించారు. క్రమం తప్పకుండా చర్చలూ, సంయుక్త విన్యాసాలూ, వినియమ కార్యక్రమాల నిర్వహణ బలగాల మధ్య సహకారాన్ని పెంపొందించుకొనేందుకు వారు అంగీకరించారు.

వియత్నాం, భారత్ మధ్య కొనసాగుతున్న విస్తరించిన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నామని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యం పరిధిలో వియత్నాం రక్షణ ఆధునికీకరణకూ, సామర్థ్య విస్తరణ కార్యక్రమాలకూ తోడ్పాటునందించడంలో భారతదేశానికున్న చిత్తశుద్ధిని ఆయన పునరుద్ఘాటించారు.

వియత్నాంకు భారత్ అందిస్తున్న నిరంతర మద్దతునూ, రెండు దేశాల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహాన్నీ, పెరుగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్నీ జనరల్ ఫాన్ వాన్ జియాంగ్ ప్రశంసించారు.

వియత్నాంలో ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్స్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన లాంగ్వేజ్ ల్యాబ్‌ను రక్షణ మంత్రులిద్దరూ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. భారత దేశ సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు. నహత్రాంగ్‌లోని టెలి కమ్యూనికేషన్స్ ల్యాబ్ వద్ద ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తామని రక్షణ మంత్రి ప్రకటించారు.

కృత్రిమ మేధ, క్వాంటమ్ టెక్నాలజీ రంగాల్లో భారత్‌లోని మిలటరీ కాలేజ్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్, వియత్నాంలోని టెలి కమ్యూనికేషన్స్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఇది రెండు దేశాల మధ్య విస్తరించిన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో ముఖ్యమైన అధ్యాయాన్ని సూచిస్తుంది.

ద్వైపాక్షిక సమావేశం అనంతరం వియత్నాం ప్రధాన కార్యదర్శి, అధ్యక్షుడు శ్రీ టో లామ్‌తో రక్షణ మంత్రి సమావేశమయ్యారు. భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి తరపున ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే రక్షణ-భద్రత, వాణిజ్యం-పెట్టుబడులు, నౌకా వాణిజ్య సహకారం, అనుసంధానత, డిజిటల్ పరివర్తన, ప్రజా సంబంధాలు తదితర రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడం వట్ల భారతదేశానికున్న నిబద్ధతను పునరుద్ఘాటించారు.

ఉమ్మడి నాగరికతా సంబంధాలు, పరస్పర విశ్వాసం, ఉమ్మడి వ్యూహాత్మక ప్రయోజనాలపై ఆధారపడిన భారత్, వియత్నాం మధ్య ఉన్న బలమైన, శాశ్వతమైన స్నేహాన్ని నాయకులిద్దరూ పునరుద్ఘాటించారు. ఇండియా-వియత్నా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో సాధిస్తున్న వృద్ధి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

భారత్‌లో తన పర్యటనను వియత్నాం అధ్యక్షుడు గుర్తు చేసుకున్నారు. ద్వైపాక్షిక సహకారంలో సాధించిన వృద్ధిని ప్రశంసించారు. వియత్నాం అభివృద్ధి, వ్యూహాత్మక ప్రాధాన్యాల్లో కీలక భాగస్వామిగా భారత్ పోషిస్తున్న పాత్రను గుర్తించారు. రెండు దేశాల మధ్య ఉన్న సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో ప్రధాన ఆధారంగా రక్షణ సహకారం బలోపేతమవడాన్ని ఆయన స్వాగతించారు. భవిష్యత్తులో ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలవడతాయనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

వియత్నాం వ్యవస్థాపకుడు, మాజీ అధ్యక్షుడు హో చి మిన్ 136వ జయంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. "ఆయన దార్శనికత, నాయకత్వం, జాతీయ స్వేచ్ఛ, ప్రపంచ ఐక్యత పట్ల నిబద్ధత తరతరాలకూ స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఉమ్మడి విలువలు, పరస్పర గౌరవంతో కూడిన భారత్-వియత్నాం స్నేహానికి ఆయన బలమైన పునాది వేశారు" అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట చేశారు.

పరస్పర విశ్వాసం, ఉమ్మడి విలువలు, రక్షణ, భద్రత, ప్రాంతీయ స్థిరత్వంలో సన్నిహిత సహకారంపై ఆధారపడిన బలమైన బంధం భారత్, వియత్నాం మధ్య ఉంది.

దేవాలయాల బంగారం నిల్వలను నగదుగా మార్చడంపై అసత్య ప్రచారం.. కేంద్రం వివరణ

న్యూ ఢిల్లీ, మే 21:దేశంలోని దేవాలయాలకు చెందిన బంగారం నిల్వలకు బదులుగా కేంద్ర ప్రభుత్వం ఆలయాలకు బంగారు బాండ్లను జారీ చేయనుందని.. అలాగే ఆలయాల్లోని బంగారు నిల్వలను నగదుగా మార్చే ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపిందని కొన్ని మీడియా నివేదికలు, సోషల్ మీడియాలో పోస్టులు ప్రచారంలో ఉన్నాయి. వీటిని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.

దేశవ్యాప్తంగా ఉన్న ఆలయ ట్రస్టులు లేదా మరేదైనా మతపరమైన సంస్థల వద్ద ఉన్న బంగారాన్ని నగదుగా మార్చే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టాలని యోచిస్తోందంటూ వస్తున్న ఊహాగానాలు, వదంతులు పూర్తిగా అవాస్తవమని, తప్పుదోవ పట్టించేవని, వాటికి ఎలాంటి ఆధారాలు లేవని కేంద్రం స్పష్టం చేసింది.

ఆలయ గోపురాలు, తలుపులు, ఇతర నిర్మాణాలపై ఉండే బంగారు పూతను "భారత వ్యూహాత్మక బంగారు నిల్వ"గా పరిగణిస్తారంటూ జరుగుతున్న ప్రచారంలోనూ ఎలాంటి నిజం లేదని, అవి పూర్తిగా నిరాధారమైనవని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఇలాంటి పుకార్లను నమ్మవద్దని, వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని ప్రభుత్వం పౌరులను కోరింది. ధ్రువీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేయడం వల్ల ప్రజల్లో అనవసరమైన గందరగోళం ఏర్పడుతుందని పేర్కొంది.

విధానపరమైన నిర్ణయాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఏదైనా సమాచారాన్ని అధికారిక పత్రికా ప్రకటనలు, ప్రభుత్వ వెబ్‌సైట్లు, ధ్రువీకరించిన ప్రజా సమాచార వేదికల ద్వారానే పంచుకుంటామని, పౌరులందరూ కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వాసంలోకి తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

సాంకేతిక నిర్మాత రాజీవ్ గాంధీ

నల్గొండ, మే 21:ఆధునిక భారత సాంకేతిక నిర్మాత స్వర్గీయ రాజీవ్ గాంధీ అని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి కొనియాడారు. రాజీవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ స్మారక భవనంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 36వ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. భారతదేశాన్ని ప్రపంచ దేశాల సరనన అగ్రగామిగా నిలిపేందుకు రాజీవ్ గాంధీ సాంకేతిక విప్లవాన్ని, కంప్యూటర్ యుగాన్ని దేశంలోకి ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. యువతకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఓటు హక్కు వయోపరిమితిని 21 ఏళ్ల నుండి 18 ఏళ్లకు తగ్గించిన ఘనత ఆయనదేనని, రాజీవ్ గాంధీ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ?ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు సుర్వి నరసింహ, రాజీవ్ ట్రస్ట్ ఉపాధ్యక్షులు జింద్రు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎంఏ . ఖయ్యూం, కార్యదర్శి నల్ల నరసింహ, నాయకులు చింతల సాయిలు, ఆవుల యేసుదాసు, కంచర్ల జంగయ్య, మాదని గోపాల్, బండమీద ఎల్లయ్య, ఎండి చాంద్ పాషా, ఊదరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పోక్సో బాధితులకు సేవలందించడమే భరోసా కేంద్రాల లక్ష్యం

-శారీరక దారుఢ్యం, ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ పెట్టాలి: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి, మే 21:పోక్సో కేసుల బాధితులకు తదుపరి మానసిక క్షోభ కలగకుండా, వారి గోప్యతను కాపాడుతూ తగిన భద్రత కల్పించడంలో భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన "భరోసా సెంటర్"తో పాటు, ఏఆర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అత్యాధునిక జిమ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, ఎల్.ఎస్. చాహన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు, పిల్లలపై హింస, వేధింపులు, లైంగిక దాడులకు గురైన బాధితులకు తక్షణ సహాయం, రక్షణ అందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా ఈ భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. బాధితులకు ఒకేచోట వైద్యం, చట్టపరమైన సహాయం, మానసిక కౌన్సెలింగ్, పునరావాసం వంటి సేవలు అందించడం ద్వారా పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చేస్తున్నట్లు తెలిపారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతూ అవసరమైన అన్ని సేవలను సమన్వయంతో అందించడమే భరోసా కేంద్రాల ప్రధాన ఉద్దేశమని వివరించారు.

సమాజంలో మద్యం సేవనం వల్ల అనేక కుటుంబ, సామాజిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొంటూ ప్రజలు తమ అలవాట్లలో మార్పు తీసుకురావాలని సూచించారు. "హెల్త్ ఈజ్ వెల్త్" సూత్రాన్ని పాటిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, శారీరక దారుఢ్యం కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని కోరారు.

యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక క్రీడా వారోత్సవాలు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. ఇందులో భాగంగానే నల్లచెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద రెండు జిమ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్ సహకారంతో ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఈ జిమ్ ఏర్పాటు చేశామని, పోలీసులు, యువత ఈ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇదే వేదికపై ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక క్రీడా, యువజన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో పోలీస్ జట్టు విజేతగా నిలవగా, ఉపాధ్యాయుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. అనంతరం పోలీసు సిబ్బందికి నూతన క్యాప్స్‌ను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు ఎస్పీ రాజేష్, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీలు బాలాజీ నాయక్, గిరి ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి ఇతర శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కేసముద్రంలో అగ్నిప్రమాదం..

-ప్రమాద వశాత్తు వరి గడ్డి, నూర్పిన ధాన్యం ఆహుతి
-సుమారు 150 ఎకరాల్లో వ్యాప్తి చెందిన మంటలు
-సుమారు రూ.5 లక్షల రూపాయల వరకు నష్టం
-కోరుకొండపల్లి గ్రామంలో సంఘటన

నల్గొండ, మే 21: కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తూ జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 150 ఎకరాల్లో వరి గడ్డి, నూర్పిడి చేసిన ధాన్యం దగ్ధమై రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఈ ఘటనలో సుమారు రూ.5 లక్షల మేర నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు.

వివరాల్లోకి వెళితే.. గురువారం మధ్యాహ్నం సమయంలో కోరుకొండపల్లి గ్రామ శివారులోని వరి పొలాల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఎండ తీవ్రత, వడగాల్పుల ప్రభావంతో మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న రైతులు మండలు, ఆకులు వంటి అందుబాటులో ఉన్న సామగ్రితో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది.

ఈ ప్రమాదంలో పలువురు రైతులు కట్టలు కట్టిన వరి గడ్డి వాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. అలాగే నూర్పిడి చేసి తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం కుప్పలు కూడా మంటల్లో కాలిపోయాయి.

రూ.5 లక్షల వరకు నష్టం

మంటల్లో మండేపల్లి శ్రీకాంత్, మడిపెల్లి కొమురయ్య, పోలేపాక సాంబయ్య, రడపాక వెంకటమ్మ, దానరి నర్సయ్య, నరోజన, చంద్రయ్యలకు చెందిన సుమారు 20 పుట్ల వరి ధాన్యం దగ్ధమైనట్లు రైతులు తెలిపారు.

అదేవిధంగా గడ్డి కట్టలు కాలిపోయిన రైతుల్లో చెలుగుల దేవేందర్ (300 కట్టలు), బిరు శీను (280), దద్దు వెంకన్న (300), దాసరి ఐలయ్య (250), దాసరి రాంబాబు (100), బీరం జైపాల్ రెడ్డి (150) తదితరులు ఉన్నారు. మరికొందరు రైతుల గడ్డి వాములు, కట్టలు కట్టేందుకు సిద్ధంగా ఉంచిన లూజ్ గడ్డి కూడా పూర్తిగా దగ్ధమైంది.

ఈ ఘటనతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆసక్తి ఉన్నవాళ్లు ఆమ్ ఆద్మీ పార్టీలో చేరండి

-జిల్లా ఇంచార్జి లక్ష్మి

ఆదిలాబాద్, మే 21:ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని శంకర్గూడ గ్రామంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జిల్లా ఇంచార్జి లక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆమ్ ఆద్మీ పార్టీ అనేది రైతుల పార్టీ అని, దేశంలో మార్పు కోరుకునేవారు, ఆసక్తి ఉన్నవాళ్లు పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడం ద్వారా రైతుల కష్టాలను తీరుస్తామని ఆమె భరోసా ఇచ్చారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలోనూ, రైతులు పండించిన మొక్కజొన్న పంట కొనుగోలులోనూ తీవ్ర జాప్యం జరుగుతోందని లక్ష్మి విమర్శించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని, జిల్లా మార్కెట్లలో రైతులకు సకాలంలో బస్తాలు కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రైతుల వడుతున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకే తాము ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటిస్తున్నామని తెలిపారు. తమ ఓట్లతో దేశాన్ని మలుపు తిప్పగల సత్తా ఉన్న రైతాంగం ఇకనైనా మేలుకోవాలని, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే అది కేవలం ఆమ్ ఆద్మీతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తనయుడు విజయ్ కుమార్ జాదవ్, హిరాలాల్, మదినే, నీవర్తి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై బీబీనగర్‌లో నేడు మహాధర్నా

నల్గొండ, మే 21:రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై నిరసనగా శుక్రవారం బీబీనగర్ పట్టణ కేంద్రంలోని పోచంపల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు రైతు బంధు సమితి మండల మాజీ కోఆర్డినేటర్ బొక్క జైపాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు తెలిపారు. గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు రాత్రింబవళ్లు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోసి వర్షాలు, ఎండల మధ్య కాపలా కాస్తున్నా ప్రభుత్వం కొనుగోళ్లపై స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. కటింగుల పేరుతో రైతులపై భారాలు మోపుతూ, బస్తాకు అదనంగా రెండు కిలోల ధాన్యం జోకుతూ బహిరంగ దోపిడీ జరుగుతోందని ఆరోపించారు.

రైతుల చెమటతో పండిన ధాన్యాన్ని కొనకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, రైతాంగాన్ని మోసం చేసే విధానాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి వీడి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోతే ఉత్తం రెడ్డి, కొమురె శ్రీకాంత్, కొంతం పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

చౌటుప్పల్, మే 21:ఆరుగాలం చెమటోడ్చి, అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాతలు మండే ఎండలో అరిగోస పడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచినా, అధికారుల నిర్లక్ష్యం, మిల్లర్ల మాయాజాలం వల్ల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 5, ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో 12, స్వచ్ఛంద సంస్థ (పీపీసీ) ఆధ్వర్యంలో 4 చొప్పున మొత్తం 21 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఈ కేంద్రాలు కాగితాలకే పరిమితమయ్యాయే తప్ప, ధాన్యం కొనుగోళ్లు మాత్రం వేగవంతం కావడం లేదు. ఇప్పటివరకు కనీసం 25 శాతం ధాన్యం కూడా కొనుగోలు చేయకపోవడం అధికారుల ఉదాసీనతకు అద్దం పడుతోంది.

ధాన్యం తూకాల విషయంలో మిల్లర్లు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పక్కనబెట్టి, తేమ శాతం (మ్యాశ్చర్) సరిగ్గా ఉన్నప్పటికీ క్వింటాలుకు 5 కిలోల పైగా అదనంగా తూకం వేస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారు. దీనికి తోడు ఎండ వేడిమికి లారీల్లోనే రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉండటం వల్ల బరువు తగ్గుతోందని, ఆ భారాన్ని కూడా రైతులపైనే వేస్తూ 'తరుగు, తాలు' పేరుతో మరింత దోపిడీకి తెరలేపారు. జిల్లా, మండల సివిల్ సప్లై అధికారులు మాత్రం క్షేత్రస్థాయికి వచ్చి రైతుల బాధలను ఆలకించాల్సింది పోయి, మిల్లర్లకే పత్తాను వలుకుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యపు బస్తాలను రైస్ మిల్లులకు తరలించేందుకు తగినన్ని వాహనాలు లేకపోవడం సమస్యగా మారింది. ఒకవేళ లారీలు మిల్లుల వద్దకు వెళ్లినా అక్కడ అన్‌లోడ్ చేయడానికి హమాలీలు ముందుకు రావడం లేదు. మిల్లర్లు ఇచ్చే కూలి చాలడం లేదని వారు నిరసన తెలుపుతుండటంతో, దిక్కుతోచని స్థితిలో రైతులు తమ సొంత డబ్బులను అదనంగా చెల్లించి హమాలీలతో అన్‌లోడ్ చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ధాన్యం మిల్లుల వద్ద వెంటవెంటనే అన్‌లోడ్ కాకపోవడం వల్ల కొనుగోలు కేంద్రాలకు లారీలు తిరిగి రావడం లేదు. దీంతో కేంద్రాల్లో ఉన్న హమాలీలకు రెండు మూడు రోజులకు ఒకసారి మాత్రమే లోడింగ్ చేసే పరిస్థితి ఎదురవుతోంది. దీనివల్ల తమకు కూలి గిట్టుబాటు కావడం లేదని, ఇలాగైతే తాము వేరే పనులకు వెళ్లిపోతామని హమాలీలు స్పష్టం చేస్తున్నారు.

తెలుగు నేల కీర్తి.... సుందర రామమూర్తి

వేటూరి పుట్టుక తెలుగు పదానికి పునరావృత జన్మదినం. ఆయన గేయ రచనా వైవిద్యం ఎందరికో స్ఫూర్తి దాయకం.

శ్రీశ్రీ తర్వాత జాతీయ అవార్డు అందుకున్న తెలుగు పాటల రచయత వేటూరి సుందర రామమూర్తి. మాతృదేవోభవ సినిమాలోని రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే పాటకు ఈ అవార్డు అందుకున్న వేటూరి. ఇటు క్లాసే కాదు.. అటు మాస్ సాంగ్స్ రాయడంలోనూ వేటూరి వారిది అందె వేసిన చెయ్యే. అలుపెరుగని, అలవోకగా ధారాపాతంగా పాటలు రాసిన గొప్పతనం వేటూరిది. పల్లెటూరి మాటలైనా, సమాస భూయిష్ట సంక్లిష్ట పదాలైనా పండితుని నుండి పామరుని వరకూ అవలీలగా చేరి, సులభంగా ప్రతీ నోటా పాడుకునేలా చేసిన అసమాన ప్రతిభ ఆయనకే సొంతమైంది.

వేటూరి సినిమా పాటలు రాయటానికి పూర్వం కొంతకాలం పత్రికల్లో పని చేసారు. తెలుగు భాష, సాహిత్యాలపై మక్కువ పెంచు కోవడానికి కారణం అయన పెదనాన్న వేటూరి ప్రభాకర శాస్త్రి, తెలుగులో ప్రథమ జ్ఞానపీఠ గ్రహీత కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. 1960 సంవత్సర ప్రాంతాల్లో మొదట ఆంధ్ర పత్రికలో కాలుని, తర్వాత ఆంధ్రపత్రిక వీక్లీకి సహాయ సంపాదకుడుగా, ఆపై కొంతకాలం ఆంధ్రప్రభ వార పత్రిక కు చీఫ్ సబ్ ఎడిటర్ గా అయన పని చేశారు. 1962లో నాటి ప్రధాని నెహ్రూ శ్రీశైలం విచ్చేసిన సందర్భంగా ప్రత్యేక ఇంటర్వ్యూ చేశారు. ఆంధ్ర జనతా పత్రికలో ఎడిటర్‌గా ఎదిగి, భద్రాచలం సమీపంలోని పాల్వంచ వద్ద జరిగిన ఒక బహిరంగ సభలో నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ పొరపాటుగా మాట్లాడిన అంశాన్ని బాక్స్ ఐటమ్‌గా ఇచ్చి సంచలనం సృష్టించిన ధైర్యశాలి వేటూరి. ఆయన కలం నుంచి జాలువారి, ఆంధ్రదేశాన్ని ఒక ఊపు ఊపిన 'సిరికాకుళం చిన్నది' గేయ రూపకాన్ని సినీ దర్శకుడు విశ్వనాథ్ విని, తొలిసారిగా ఓ సీత కథ చిత్రంలో వేటూరికి అవకాశం కల్పించారు.

ఎన్టీఆర్ నటించిన "దీక్ష" సినిమాలో మెదటి సారిగా సినిమాకు గీతరచన ప్రారంభించినా అది సినిమాలో రాలేదు. 1972 సంవత్సరం "ఓ సీత కథ" సినిమాలో లీల పాడిన హరికథతో, సినిమా దర్శకులు కె.విశ్వనాథ్ ప్రోత్సాహంతో సినిమా పాటల రచయితగా శ్రీకారం చుట్టి, వెనుతిరిగి చూడకుండా సాగుతూ, వరసగా సినిమా పాటలు రాస్తూ వచ్చారు.

వేటూరిగా పిలవబడే వేటూరి సుందర రామమూర్తి (జనవరి 29, 1936 - మే 22, 2010) లాంటి రచయిత సినీ పరిశ్రమకు పరిచయం కావడం తెలుగు ప్రజలు చేసుకున్న పురాకృత సుకృతం. సుందర రామమూర్తి 1936 జనవరి 29 న కృష్ణా జిల్లా, మోపిదేవి మండలం పెదకళ్ళే పల్లిలో జన్మించారు. మద్రాసులోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్, బెజవాడలో డిగ్రీ పూర్తి చేశారు. 1956 నుంచి పదహారేళ్ళ పాటు పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. ముందుగా దైతా గోపాలం ఆ తర్వాత మల్లాది వద్ద శిష్యరికం చేశారు. వేటూరి సుందర రామ్మూర్తి 8 నంది అవార్డులతో పాటు మొత్తం 14

మే 22...వేటూరి వర్ధంతి



అవార్డులు, ఒక జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు పాటకు శ్రీశ్రీ తర్వాత జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టింది వేటూరియే. కేంద్ర ప్రభుతం తెలుగు భాషకు ప్రాచీన భాషా హోదా ఇవ్వనందుకు నిరసనగా తన పాటకు వచ్చిన జాతీయ పురస్కారాన్ని తిరిగి ఇచ్చి, తన మాతృ భాషాభిమానాన్ని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది.

వేటూరి మొదటి పాట ఓ సీత కథ. చివరి పాట బద్రినాథ్ లోని ఓంకారేశ్వర పాట. ఆ మధ్య కాలంలో ఆయన వేల పాటలను రాశారు. ఓంకారేశ్వర పాటలో 108 వైష్ణవ దివ్య స్థలాలను తన పాటలో వ్యక్త పరిచిన తీరు అసమానం. అపూర్వం, మహోద్భుతం.

సంప్రదాయ కవిత్వ పద బంధాల నుండి జానపద గీతాల వరకు అన్నింటిలోనూ తన ప్రతిభను నిరూపించు కున్నారు. కవనంలో, భావంలో, భాషలో పండితుల నుండి పామరుల వరకు అందరిని అలరించిన విశిష్ట శైలి ఆయన సొంతం. దర్శకులకు, నిర్మాతలకు, నటీ నటులకు, సినీ సంబంధీకులకు ఆలంబనగా నిలిచింది. శ్రోతల హృదయాలను దోచింది. పసలేని చిత్రాలను పాటల ద్వారా తీరాలకు చేర్చింది. ఒక్క మాటలో ... సినీ పరిశ్రమను అన్ని విధాలా ఆదుకుంది. వేటూరి పాటల పూదోటలో ప్రతీ పాటా పరిమళం కొల్పోని సుగంధ పుష్పాలే. ఎన్నటికీ వాడిపోని అందమైన లతాంతాలే. వేటూరి సినీ పాటల పరంపర నాలుగు దశాబ్దాలకు పైగా నిరాటంకంగా కొనసాగింది. 1974 నుంచి 1800 తెలుగు సినిమాలకు ఆరు వేల పాటలను అందించి, తనదైన ప్రత్యేకతను చాటు కున్నారు.

గాన గంధర్వుడు దివంగత ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం మాటల్లో చెప్పాలంటే... 'ఉపనిషత్తుల నుంచి ఉలిపిరి కాయితం వరకూ , దేన్ని గురించైనా అపారమైన పరిజ్ఞానం ' వేటూరిది. మహా కవి శ్రీశ్రీ అన్నట్లు...తాను కన్న, విన్న, అనుభవించిన, ఊహించిన ప్రతి అంశాన్ని పదబద్ధం చేసి, కాదేదీ కవితకు అనర్హం అని నిరూపించిన నేర్పరి వేటూరి. వేటూరి భువి నుండి దివికేగినా, ఆయన పాటలు అజరామరాలు, నిరంతరం తెలుగు వారి నాలుకలపై నడయాడే సుస్వరాలు.

వేటూరి ఉత్తమ సాహిత్యానికి నంది అవార్డును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఆరుసార్లు అందుకున్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం 23 వ కాన్వొకేషన్‌లో ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. 2007 లో జంధ్యాల మెమోరియల్ అవార్డును అందుకున్నారు. తుమ్మలపల్లి క్షేత్రయ కళాక్షేత్రం విజయవాడ

జాతీయ పురస్కారాలలో మాతృ దేవోభవ చిత్రంలోని ''రాలిపోయే పువ్వా'' ఉత్తమ సాహిత్యానికి జాతీయ చలనచిత్ర పురస్కారాన్ని అందుకుంది. 2006 లో, తెలుగుకు క్లాసికల్ లాంగ్వేజ్ హోదాను భారత ప్రభుత్వం ఇవ్వకపోతే తాను జాతీయ అవార్డును తిరిగి ఇస్తానని ప్రకటించారు. 2008 లో, భారత ప్రభుత్వం తెలుగును శాస్త్రీయ భాషగా ప్రకటించింది.

2006లో ఉప్పొంగెలే గోదావరి చిత్రానికి ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకున్నారు. 2008 లో ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. తెలుగు ప్రజల మనో ఫలకాలపై చెరగని ముద్రలు వేసి 75 సంవత్సరాల వయస్సులో మే 22, 2010 న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు.

-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

-జేఏసీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సురవి యాదయ్య గౌడ్

నల్గొండ, మే 21:గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టిన మాజీ సర్పంచులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని జేఏసీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం జూన్ 1న చేపట్టబోయే ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని పేర్కొంటూ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో సర్పంచులు అప్పులు తెచ్చి మరీ గ్రామాల్లో ఎన్నో ప్రగతి పనులు చేపట్టారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎస్ఎఫ్‌సీ,ఎస్‌డీఎఫ్, సీడీఎఫ్, మన ఊరు మన బడి నిధులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో మాజీ సర్పంచులు కొందరు ఆత్మహత్యలు చేసుకోగా మరికొందరు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించి బిల్లులు చెల్లించకపోతే జూన్ 1న హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ముట్టడి కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మాజీ సర్పంచులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కేశబోయిన మల్లయ్య యాదవ్, కోదాడ మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు దొంగల లక్ష్మీనారా యణ, మాజీ సర్పంచ్ పొట్ట శ్రీ విజయ కిరణ్ పాల్గొన్నారు..

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద హెచ్చుతగ్గులు.. లోడ్ బ్యాలెన్స్‌పై విద్యుత్ శాఖ చర్యలు

బూర్గంపహాడ్, మే 21 : బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక పంచాయతీలో ట్రాన్స్‌కో డీఈ జీవన్ కుమార్ ఆదేశాల మేరకు ఏడీఈ నరసింహారావు పర్యవేక్షణలో ఏఈ ఉపేందర్ ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ శాఖ సిబ్బంది ట్రాన్స్ ఫార్మర్ల వద్ద హెచుతగ్గులు. లోడ్ బ్యాలెన్స్ పై చర్యలు చేపట్టారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో పాటు వినియోగదారులు ఏసీ, కూలర్లు ఎక్కువ సామర్థ్యం వేరకు వాడుతుండడంతో ట్రాన్స్ ఫార్మర్ల వద్ద హై వోల్టేజ్ కారణంగా ఫీజులు ఎగిరిపోతున్నాయని. ఈ క్రమంలో వాటిని సరిచేసేందుకు హెచ్చుతగ్గులు చేస్తూ, లోడ్ బ్యాలెన్స్ చేస్తూ సిబ్బంది, రాత్రనకా పగలనక పని చేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు పోవడం జరుగుతుందని, ఈ సమస్యను అధిగమించేందుకు ప్రతిరోజూ ఉదయం గంట, సాయంత్రం గంటసేపు విద్యుత్ సరఫరాకు స్వల్ప అంతరాయం ఏర్పడ తుందని విద్యుత్ శాఖ ఏడీ నర్సింహారావుతో పాటు ఏఈ ఉపేందర్ చెబుతున్నారు. దీనికి వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎం ఎం.సత్యనారాయణ, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో నూతన డ్రైవర్స్ రెస్ట్ హాల్ ప్రారంభం

నల్గొండ, మే 21: కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో నూతనంగా నిర్మించిన డ్రైవర్స్ రెస్ట్ హాల్‌ను గురువారం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెం రాజు ప్రారంభించారు. డ్రైవర్లకు మెరుగైన సౌకర్యాలు, విశ్రాంతికి అనుకూలమైన వాతావరణం కల్పించే లక్ష్యంతో ఈ రెస్ట్ హాల్‌ను ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నూతన రెస్ట్ హాల్‌లో సౌకర్యవంతమైన సీటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు డ్రైవర్ల విశ్రాంతి తీసుకునేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించినట్లు అధికారులు చెప్పారు. సిబ్బంది సంక్షేమం సంస్థ అభివృద్ధికి కీలకమని, డ్రైవర్లకు అవసరమైన మౌలిక వసతులు అందించేందుకు యాజమాన్యం కట్టుబడి ఉందని జీఎం వెల్లడించారు.

ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ.. తమ కోసం ప్రత్యేకంగా ఆధునిక సౌకర్యాలతో రెస్ట్ హాల్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. సిబ్బంది సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న జీఎం షాలెం రాజు, ఎస్.ఓ. టు జీఎం కోటిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ. టు జి.ఎం కోటిరెడ్డి, ఏజీఎం (సివిల్) రామకృష్ణ, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, వికేసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహారావు, డి.వై.ఎస్.ఇ రాజారాం, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, సీనియర్ పిఓ ఎం. మురళి, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్, ఎస్సీ/ఎస్టీ వెల్ఫేర్ జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు, ఇతర అధికారులు, యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'యువ ఆపద మిత్ర' శిక్షణ

నల్గొండ, మే 21: ఎన్సీసీ 31 (టి) బెటాలియన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహిస్తున్న 'యువ ఆపద మిత్ర శిక్షణ విజయవంతంగా కొనసాగుతుంది. గురువారం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఎంఏ), ఎన్సీసీ ఆధ్వర్యంలో నీట మునిగిన వారిని రక్షించే అంశంపై పానగల్‌లోని ఉదయ సముద్రంలో ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. బోట్లు, లైఫ్ జాకెట్స్, ఇతర రక్షణ సామగ్రిని ఉపయోగించి నీటి మునిగే ప్రమాదాలు సంభవించినపుడు బాధితులను ఎలా రక్షించాలి అనే అంశంపై మాక్ డ్రీల్‌లో శిక్షణ అందించారు. అదే విధంగా వాస్తవ విపత్తు పరిస్థితుల్లో సంభవించే

ప్రమాదాల్లో ఎన్సీసీ విద్యార్థుల పాత్రను వివరించి వారిలో స్ఫూర్తి నింపారు. శిక్షణలో ఎన్సీసీ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ శశిధర్‌రావు, సుబేదార్‌మేజర్ మాధవరావు, కొమ్ము మల్లయ్య, డీఆర్డీఓ ఏపీడీ హరీష్ కుమార్, ఎన్జీఓఎం ప్రతినిధులు సాయి, దీపక్, ఎంజీయూ ఎన్సీసీ అసిస్టెంట్ అదికారి డా.మచ్చేందర్, వివిద కళాశాలల ఎన్సీసీ అధికారులు భాగ్యలక్ష్మి, శివకుమార్, పాల్గొన్నారు.

పండించిన జొన్న ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు : ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆదిలాబాద్, మే 21: రైతులు తాము పండించిన జొన్న ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మార్కెట్ కమిటీ గోదాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్), మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో క్వింటాల్ జొన్నలకు మద్దతు ధర రూ. 3,699 ప్రభుత్వం చెల్లించి కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుమేత విశ్వనాథ్ రావు, జైనూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్, జైనూర్ సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, ఆసిఫాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్ హాజరయ్యారు.

సర్పంచులు మడవి కౌసల్య భీమ్రావు, కుమ్ర యశోద కేశవరావు, విఠల్, ఆత్రం తులసి, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మండల అధ్యక్షులు ఇంతియాజ్ లాలా, అబ్దుల్ ముఖీద్, జైనూర్ వ్యవసాయ అధికారి ఆనందరావు, సహకార సంఘం సీఈవో సోన్‌కాంబ్లే జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ పెయింట్స్ 'యాంటీ-డాంప్ టెక్నాలజీ' ఆవిష్కరణ

హైదరాబాద్, మే 21: ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు అందంగా, సౌకర్యవంతంగా, ఏళ్ల తరబడి మన్నికగా ఉండాలని కోరుకుంటారు. అయితే, ఎకానమీ పెయింట్ విభాగంలో (అందుబాటు ధరల్లో ఉండే రంగులు) ఇవన్నీ ఉండే ఉత్పత్తులు చాలా వరకు కష్టమే. వీటన్నింటిలోనూ అత్యంత సాధారణమైన సమస్య గోడలపై వచ్చే నీటి మరకలు (వాటర్ మార్క్). ఇది ఇంటి అందాన్ని మెల్లగా దెబ్బతీస్తుంది. దీనిని గుర్తిస్తూ, ఈ సమస్యకు చెక్ పెట్టడానికి ఏషియన్ పెయింట్స్ 'ఏస్', 'ట్రాక్టర్ ఎమల్షన్స్'లో 'యాంటీ-డాంప్ టెక్నాలజీ'ని ఆవిష్కరించింది. అద్భుతమైన పనితీరు, ఆకర్షణీయమైన లుక్‌తో ఈ ఎకానమీ రేంజ్ ఉత్పత్తులపై నాలుగేళ్ల వారంటీని కూడా ఇస్తుంది. ఏషియన్ పెయింట్స్ అత్యంత నమ్మకమైన, విస్తృతంగా ఉపయోగిస్తున్న బ్రాండ్లలో ఒకటైన 'ఏస్', 'ట్రాక్టర్ ఎమల్షన్స్' ఎకానమీ విభాగంలో నాణ్యతను, విలువను అందించడం ద్వారా ఇంటి యజమానులు, డీలర్లు, కాంట్రాక్టర్ల నమ్మకాన్ని చెలంచుకున్నాయి. వినియోగదారుల అవసరాలను తీర్చడం కోసం ఈ ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియో నిరంతరం కొత్త ఆవిష్కరణలను పరిచయం చేస్తూనే ఉంది. ఇందులో మెరుగైన విలువను అందించే 'ట్రాక్టర్ ఎ ఏస్ స్పార్క్', తక్కువ ధరలో మెరిసే రూపాన్ని అందించే 'ట్రాక్టర్ ఎ ఏస్ షైన్' కూడా ఉన్నాయి. యాంటీ-డాంప్ టెక్నాలజీ పరిచయంతో ఏషియన్ పెయింట్స్ ఇంటి యజమానులు ఎదుర్కొనే అత్యంత సాధారణ సవాళ్లలో ఒక దానికి పరిష్కారాన్ని చూపుతూ నమ్మకమైన వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్తుంది. ఈ కొత్త సాంకేతికత గోడలపై నీటి మరకలు (వాటర్ మార్క్) పడకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. ఈ ఆవిష్కరణ ద్వారా ఎకానమీ పెయింట్ విభాగంలోని వినియోగదారులకు దీర్ఘకాలిక మన్నికను, మానసిక ప్రశాంతతను అందించడమే కంపెనీ లక్ష్యం. ఈ ముఖ్యమైన విషయాన్ని అందరికీ అర్థమయ్యే రీతిలో తెలియజేయడానికి నరికొత్త క్యాంపెయిన్ ప్రారంభించింది. ప్రముఖ నటులు గజరాజ్ రావు, బ్రిజేంద్ర కాలా నటించిన ఈ యాడ్ ఫిల్మ్‌లో ఒక ఇంటి యజమాని తన ఇంటికి వచ్చిన అతిథికి అతిథ్యం ఇస్తున్నప్పుడు 'నీటి మరక' (వాటర్ మార్క్) పదేపదే వారి మధ్యలోకి వస్తూ ఎలా అంతరాయం కలిగిస్తుందో చూపిస్తుంది. ఆ ఇంటి యజమాని ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, అత్యంత అసౌకర్యమైన సమయాల్లో ఆ నీటి మరక మళ్లీ మళ్లీ ప్రత్యక్షమవుతూ ఉంటుంది. గోడలు తడిసి ఆరిపోయిన తర్వాత వచ్చే నీటి మరకల వల్ల ఎదురయ్యే రోజువారీ ఇబ్బందులను ఈ కథనం కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. అదే సమయంలో యాంటీ-డాంప్ టెక్నాలజీ ఇటువంటి సమస్యలను ఎలా నివారిస్తుందో నొక్కి చెబుతుంది.

సింగరేణి ఆధ్వర్యంలో పెనగడపలో ఉచిత వైద్య శిబిరం

రుద్రంపూర్, మే 21 : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో వి.కె.సి.ఎం ప్రాజెక్టు ప్రభావిత, పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా పెనగడప గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు గ్రామ ప్రజలకు రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ప్రజల ఆరోగ్య సంక్షేమానికి సింగరేణి సంస్థ కట్టుబడి ఉందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి వైద్య శిబిరాలను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ లలిత కుమారి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపించి, నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వి.కె.సి.ఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహ రావు మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు సింగరేణి యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ విక్టర్, ఏఐటీయూసీ నాయకులు ఎం.ఆర్.కే ప్రసాద్, ఐఎన్టీయూసీ నాయకులు గోపు కుమార్, ఇతర వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com